మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి ఈవార్తలు
NETI EVARTHALU దినపత్రిక
PRGI REGD NO: TGTEL/25/A1385
Circulated to Telangana
Published from Jagitial
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం
FRIDAY
25-9-2026

జగిత్యాల JAGITIAL || పేజీలు:12 PAGES:12 || వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 2 Volume:2 || సంచిక: 87 Issue: 87


25 సెప్టెంబర్ 2026 - శుక్రవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు భాద్రపద మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:09 సూర్యాస్తమయం - సా. 6:06 తిథి చతుర్దశి రా. 11:02 వరకు తరువాత పౌర్ణమి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం శతభిష ఉ. 11:10 వరకు తరువాత పూర్వాభాద్ర యోగం శూల మ. 2:43 వరకు కరణం గరజి ఉ. 11:14 వరకు వనిజ రా. 11:02 వరకు వర్జ్యం సా. 5:48 నుండి రా. 7:25 వరకు దుర్ముహూర్తం ఉ. 8:32 నుండి ఉ. 9:20 వరకు మ. 12:31 నుండి మ. 1:19 వరకు రాహుకాలం ఉ. 10:38 నుండి మ. 12:07 వరకు యమగండం మ. 3:07 నుండి సా. 4:36 వరకు గుళికకాలం ఉ. 7:38 నుండి ఉ. 9:08 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:33 నుండి తె. 5:21 వరకు అమృత ఘడియలు తె. 3:23 నుండి తె. 5:00 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:43 నుండి మ. 12:31 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



మీ ఇంట్లో ఆర్వో ప్యూరిఫయర్ ఉందా? అది నీళ్లను 100 శాతం స్వచ్ఛంగా తయారుచేస్తుందని ఆనందపడుతున్నారా? ఇంతకన్నా మంచి నీళ్లు ఉండవని, ఆరోగ్యానికి అవే మంచివని అనుకుంటున్నారా? అయితే, అంతకుమించిన తప్పిదం మరోటి ఉండదు. ఎందుకంటే.. ఆర్వో వాటర్ తాగడానికి ఎందుకూ పనికిరాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. రివర్స్ ఆస్మాసిస్ (ఆర్వో) ప్రక్రియ నీటిలోని అనేక మలినాలు, ఉప్పులు, భార లోహాలు, సూక్ష్మజీవులను తొలగించడంలో సమర్థంగా పనిచేస్తుంది. అయితే అదే సమయంలో శరీరానికి అవసరమైన కాల్షియం, మెగ్నీషియం వంటి ఖనిజ లవణాల్లోనూ గణనీయమైన భాగాన్ని తొలగించే అవకాశం ఉందని చెప్తున్నారు. ఆర్వో వల్ల అనేక లవణాలు శరీరానికి అందకుండాపోతున్నాయని హెచ్చరిస్తున్నారు.



# ఆర్వో వాటర్.. వద్దే వద్దు!

Ro Water

## ఖనిజ లవణాలనూ తొలగిస్తున్న శుద్ధి ప్రక్రియ

## అవసరమైన ఖనిజాలు తగ్గితే ఆరోగ్యంపై ప్రభావం

## నీటి నాణ్యత కంటే సమతుల్యతే ముఖ్యం: నిపుణులు

## టీడీఎస్ 500 ఉన్న నీళ్లనే తాగాలి: శాస్త్రవేత్తలు

### టీడీఎస్ 500 వరకు ఉండొచ్చు

నీటిలో టీడీఎస్ 500 వరకు ఉండాలి. నీటి సమస్య ఉన్న చోట టీడీఎస్ 1000 వరకు ఉన్నా సమస్య లేదు. టీడీఎస్ 500 కంటే తక్కువ ఉంటే నీళ్లు తాగినా ప్రయోజనం లేదు. పైగా, శరీరానికి అవసరమైన అనేక ఖనిజ లవణాలను కోల్పోయే ప్రమాదం ఉంది. ప్రజలు తాగే నీటిలో టీడీఎస్ 500 వరకు ఉండేలా చూసుకోవాలి. ఒకవేళ నీటిలో క్రిములు ఉన్నాయని భావిస్తే, కాచి చల్లార్చిన నీటిని తాగడం మేలు.

- స్వచ్ఛ్ మజుందార్, శాస్త్రవేత్త, సీఎస్ఐఆర్ సీజీసీఆర్ఐ-కోల్‌కతా



(ఈవార్తలు - ఎడిటర్స్ నోట్)

నీటిలో కాల్షియం లోపించడం వల్ల ఎముకలు, కీళ్ల నొప్పులు వస్తాయని, పిల్లలలో ఎముకల ఫ్రాక్చర్ల ప్రమాదం పెరిగే అవకాశం ఉందని వెల్లడిస్తున్నారు. దీర్ఘకాలికంగా మెగ్నీషియం లోపించిన నీటిని తాగడం వల్ల అధిక రక్తపోటు, హృదయ స్పందనలో హెచ్చుతగ్గులు ఏర్పడి గుండెపోటు వచ్చే అవకాశాలు పెరుగుతాయని హెచ్చరిస్తున్నారు. శరీరానికి అవసరమైన లవణాలు అందకపోవడంతో కండరాల తిమ్మిరి, తీవ్రమైన తలనొప్పి, రోజంతా అలసటగా అనిపించడం వంటి సమస్యలు తలెత్తుతాయని, విటమిన్ బీ12 లోపం, అసిడిటీ, గ్యాస్ట్రిక్ అల్సర్లు, జీర్ణక్రియ సమస్యలు వస్తాయని పేర్కొంటున్నారు.

**ఖనిజాలనూ తీసేస్తుంది**

రివర్స్ ఆస్మాసిస్ అంటే అధిక ఒత్తిడితో నీటిని అతి సూక్ష్మ రంధ్రాలున్న పొర ద్వారా పంపించి అందులో కరిగి ఉన్న అనేక పదార్థాలను తొలగించే ప్రక్రియ. అమెరికా వ్యాధి నియంత్రణ, నివారణ కేంద్రాల ప్రకారం ఆర్వో వ్యవస్థలు సీసం, రాగి, క్రోమియం, క్లోరైడ్, సోడియం వంటి కొన్ని పదార్థాలను తొలగిస్తాయి. అదే సమయంలో కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, నైట్రేట్, ఫ్లోరైడ్ తరువాయి 2 వ పేజీలో...



## కుండపోత..!

3



### బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,268 |
| వెండి (కిలో): | రూ.2,,50,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,390 |

### విశ్వవాణి



మన కళ్లలో రంగులను గుర్తించే కోన్ కణాల్లోని 'ఆప్సిన్లు' ఎలా పనిచేస్తాయో తెలుసుకునేందుకు శాస్త్రవేత్తలు తొలిసారిగా వాటి అధిక స్పష్టత కలిగిన త్రిమితీయ నిర్మాణాన్ని గుర్తించారు. చీకటి స్థితిలో ఉన్న ఈ ప్రొటీన్ల నిర్మాణాన్ని అధ్యయనం చేయడం కష్టంగా ఉండేది. కాంతి కంటిలోకి ప్రవేశించినప్పుడు 'రెటినాల్' అనే కాంతి స్పందన అణువు ఆకారం మారి ఆప్సిన్‌ను క్రియాశీలం చేస్తుంది. నీలం, ఆకుపచ్చ రంగులను గుర్తించే ఆప్సిన్లలో రెటినాల్ అమరికలోని సూక్ష్మ తేడాలను పరిశోధకులు గుర్తించారు. ఇవే కంటి కణాలు కాంతిని వేగంగా గుర్తించి, నిరంతరం రంగులను చూడగలిగే సామర్థ్యానికి కారణమని భావిస్తున్నారు.

# ఎమ్మెల్యేగా ఫిక్స్‌డ్ డిపాజిట్.. ఎంపీగా షేర్ మార్కెట్‌లో!



## ఆయారాం గయారాం.. మళ్లీ ఆయారాం కైసా?

## దానం నాగేందర్ కేసులో కీలక వ్యాఖ్యలు

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో బిగ్ షాక్ తగిలింది. దానం నాగేందర్‌ను తెలంగాణ హైకోర్టు ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటిస్తూ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. ఈ క్రమంలో ఉప ఎన్నికల్లో పోటీ చేయాలని దానంకు సుప్రీంకోర్టు ధర్మాసనం సూచించింది. అనర్హత వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్.. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. చీఫ్ జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జయమల్య బాగ్చి, జస్టిస్ వి మోహనలతో కూడిన ధర్మాసనం గురువారం విచారించింది.

న్యూఢిల్లీ: తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని అభిప్రాయపడింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ జయమల్య బాగ్చి పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'మీకు (దానం నాగేందర్) ఎమ్మెల్యేగా ఫిక్స్ డిపాజిట్ ఉంది. ఎంపీగా షేర్ మార్కెట్‌లో అదృష్టం పరీక్షించుకున్నారు. ఇప్పుడు ఆ డిపాజిట్ పోయిందిస' అంటూ వ్యాఖ్యానించారు. పార్టీ సభ్యత్వం వదులకున్న వారిని క్షమించే నిబంధన కూడా ఉందని దానం నాగేందర్ తరపు న్యాయవాది ముకుల్.. న్యాయస్థానం దృష్టికి తీసుకురాగా.. 'ఘర్ వాపసీనా' ఆ రూల్ ఇక్కడ వర్తించదని న్యాయమూర్తి అన్నారు. 'ఆయా రామ్, గయా రామ్, మళ్లీ ఆయా రామ్ కైసా?' అని వ్యాఖ్యానించారు. కాగా, దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు విధించిన అనర్హతను సుప్రీంకోర్టు తరువాయి 2 వ పేజీలో...



# సీఈసీ అభిశంసనకు విపక్షాల కసరత్తు

## ఎస్ఐఆర్‌పై అభ్యంతరాల నేపథ్యంలో నిర్ణయం

## 14 సార్లు అభ్యంతరాలు తెలిపారన్న కథనాలు

## వచ్చే వారం పార్లమెంటులో నోటీసుకు అవకాశం

ఎస్ఐఆర్ ప్రక్రియపై నెలకొన్న వివాదాల నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను అభిశంసించేందుకు కాంగ్రెస్ సారథ్యంలో ప్రతిపక్షాలు కసరత్తు చేస్తున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ అంశంపై ఇండియా కూటమిలో ఏకాభిప్రాయం కుదిరినట్టు సమాచారం. అభిశంసన తీర్మానం నోటీసును వచ్చే వారం పార్లమెంటులో ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24: ఎస్ఐఆర్ సహా ఎన్నికల కమిషన్ నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి గత పది నెల్లో కనీసం 14 సార్లు అభ్యంతరాలు నమోదు చేసినట్టు 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం పేర్కొంది. ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, ఫారం-6లో మార్పులు, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ వంటి అంశాలపై ఈ అభ్యంతరాలు వ్యక్తమైనట్టు -2 వ పేజీలో...

# '22ఏ'లో ఉన్నా రిజిస్ట్రేషన్

## తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (ఈవార్తలు): రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో చేరిన భూముల విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వేలాది మంది ఆస్తి యజమానులకు భారీ ఊరట కల్పించింది. 22ఏ జాబితాలో ఉన్నప్పటికీ... జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ వంటి సంస్థల నుంచి అనుమతులు పొందిన లేఅవుట్లు, భవనాలకు రిజిస్ట్రేషన్లు చేసేందుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేయగా, అవి తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. సాంకేతిక కారణాలు లేదా రెవెన్యూ వర్గీకరణల వల్ల 22ఏ జాబితాలో చేరినప్పటికీ, చట్టబద్ధమైన ప్రణాళికా సంస్థల నుంచి అనుమతులు ఉంటే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయవచ్చని ప్రభుత్వం తెలిపింది. ఈ నిర్ణయంతో ఇప్పటివరకు రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన ఆస్తుల యజమానులు ఇకపై నేరుగా తమ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవడమే కాకుండా, ఇతరులకు బదిలీ చేసేందుకు కూడా మార్గం సుగమమైంది. ముఖ్యంగా తరువాయి 2 వ పేజీలో...






## నీట్ పీజీ-2026 ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా వైద్య విద్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పీజీ 2026 ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ ఈ ఫలితాలను గురువారం అధికారిక వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచింది. ఆగస్టు 30న ఈ పరీక్షను నిర్వహించిన విషయం తెలిసిందే. జైపూర్‌లోని రెండు కేంద్రాల్లో సమస్యలు తలెత్తిన అభ్యర్థులకు రీ-ఎగ్జామ్ కూడా నిర్వహించారు.



## ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా పుస్తకావిష్కరణ

### 'విశ్వసంచార్ హిందుత్వ కా' గ్రంథం ఆవిష్కరణ

భారత సాంస్కృతిక ప్రయాణంపై చర్చలకు దోహదం చేస్తుందన్న ఆశాభావం

ఉపరాష్ట్రపతి భవన్‌లో కార్యక్రమం.. పలువురు ప్రముఖుల హాజరు

## రాశి ఫలాలు

25.9.2026

మేషం: మిత్రులతో చిన్నపాటి వివాదాలు ఉంటాయి. ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా పడతాయి. ప్రయాణాలలో మార్గ అవరోధాలు కలుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో ఒత్తిడులు తప్పవు. సంతాన ఆరోగ్య సమస్యలు కొంత బాధిస్తాయి. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి.

వృషభం: చేపట్టిన పనులు శ్రమతో గాని పూర్తి కావు. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. ప్రత్యర్థుల నుంచి ఊహించని సమస్యలు కలుగుతాయి. వ్యాపార ఉద్యోగాలు సాదాసీదాగా సాగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు.

మిథునం: వృత్తి, వ్యాపారాలు ఉత్సాహవంతంగా సాగుతాయి. దూరప్రాంతాల నుంచి శుభవార్తలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉంటుంది. ఉద్యోగ వాతావరణం అనుకూలంగా ఉంటుంది. కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. చేపట్టిన పనులు సజావుగా పూర్తి చేస్తారు.

కర్కాటకం: వ్యాపార, ఉద్యోగాల్లో ఊహించని మార్పులు ఉంటాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. పుణ్యక్షేత్రాలు సందర్శించుకుంటారు. నిరుద్యోగ ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి. ఋణదాతల నుంచి ఒత్తిడి అధికమవుతుంది. బంధువులతో విభేదాలు మానసికంగా చికాకు పరుస్తాయి.

సింహం: చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. ఇంటా బయట పరిస్థితులు అనుకూలిస్తాయి. వ్యాపారాలు మరింత పుంజుకుంటాయి. ఉద్యోగాలలో సమస్యలు పరిష్కారమవుతాయి. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి.

కన్య: పనులు కొన్ని వాయిదా పడుతాయి. కుటుంబ సభ్యులతో అకారణ వివాదాలు కలుగుతాయి. ఉద్యోగమున అదనపు బాధ్యతలు పెరుగుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి వ్యాపారాలలో అధిక శ్రమతో అల్ప ఫలితాన్ని పొందుతారు. స్థిరాస్తి వివాదాలలో శిరో బాధలు తప్పవు.

తుల: వ్యాపారాలు మరింత లాభసాటిగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభాపాటవాలు వెలుగులోకి వస్తాయి. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. రాజకీయ సంబంధిత సమావేశాలకు ఆహ్వానాలు అందుతాయి. మొండి బకాయిలు వసూలవుతాయి.

వృశ్చికం: నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. వృత్తి వ్యాపారాలు మరింత లాభసాటిగా సాగుతాయి. విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. చిన్ననాటి మిత్రులను కలుసుకుని కష్టసుఖాలను పంచుకుంటారు. ఉద్యోగాల్లో పదోన్నతులు పెరుగుతాయి.

ధనస్సు: సోదరులతో స్వల్ప వివాదాలు తప్పవు. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. వ్యాపారాలు సామాన్యంగా ఉంటాయి. ఉద్యోగులకు అదనపు పనిభారం ఉంటుంది. ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలు ఉన్నవి. కొన్ని వ్యవహారాలు శ్రమతో గాని పూర్తి కావు.

మకరం: ఉద్యోగులకు పని ఒత్తిడులు అధికమవుతాయి. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసుకోకపోవడం మంచిది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. పనుల్లో ఆటంకాలు తప్పవు. భాగస్వామ్య వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి.

కుంభం: నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు అందుతాయి. ముఖ్యమైన కార్యక్రమాల్లో విజయం సాధిస్తారు. వృత్తి, వ్యాపారాలు సాఫీగా సాగుతాయి. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. అవసరానికి సన్నిహితుల సహాయం పొందుతారు. జీవిత భాగస్వామితో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

మీనం: దూరపు బంధువుల నుండి శుభవార్తలు అందుతాయి. నిరుద్యోగులకు అధికారుల అనుగ్రహం కలుగుతుంది. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. విందు వినోద కార్యక్రమాలకు ధనవ్యయం చేస్తారు. వ్యాపార విస్తరణకు కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుతాయి.

# ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా పుస్తకావిష్కరణ

**'విశ్వసంచార్ హిందుత్వ కా' గ్రంథం ఆవిష్కరణ**
**భారత సాంస్కృతిక ప్రయాణంపై చర్చలకు దోహదం చేస్తుందన్న ఆశాభావం**
**ఉపరాష్ట్రపతి భవన్‌లో కార్యక్రమం**
**పలువురు ప్రముఖుల హాజరు**




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24: ఉపరాష్ట్రపతి సి.పీ. రాధాకృష్ణన్ గురువారం ఉపరాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 'విశ్వసంచార్ హిందుత్వ కా' పుస్తకాన్ని ఆవిష్కరించారు. సాప్తాహిక వివేక్ ప్రచురించిన ఈ గ్రంథాన్ని ఆవిష్కరిస్తూ భారత సాంస్కృతిక వారసత్వం, ప్రపంచంతో దేశానికి ఉన్న చారిత్రక అనుబంధాలపై చర్చలకు ఇది దోహదం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భారతీయ ఆలోచనా విధానం, సంస్కృతి, ప్రపంచంతో పరస్పర సంబంధాలపై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి రచనలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ భారతదేశం అనేక శతాబ్దాలుగా ప్రపంచ నాగరికతలతో సాంస్కృతిక, ఆధ్యాత్మిక, సామాజిక సంబంధాలను కొనసాగిస్తోందన్నారు. ఆ ప్రయాణాన్ని అధ్యయనం చేయడం ద్వారా దేశ చరిత్ర, సంస్కృతి, విలువలను మరింత లోతుగా అర్థం చేసుకునే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతి ప్రపంచవ్యాప్తంగా చూపిన ప్రభావాన్ని గుర్తుచేసే గ్రంథాలు సమాజానికి ఉపయోగకరంగా ఉంటాయని అభిప్రాయపడ్డారు.

పుస్తకాలు కేవలం సమాచారాన్ని అందించడమే కాకుండా ఆలోచనలకు కొత్త దిశను చూపుతాయని ఉపరాష్ట్రపతి అన్నారు. దేశ చరిత్ర, సంప్రదాయాలు, విలువలపై యువతలో ఆసక్తి పెంచడంలో ఇటువంటి ప్రచురణలు ముఖ్యపాత్ర పోషిస్తాయని తెలిపారు. భారతదేశ సాంస్కృతిక ప్రయాణాన్ని విభిన్న కోణాల్లో పరిశీలించే రచనలకు సమాజంలో ఆదరణ పెరుగుతోందని పేర్కొన్నారు. 'విశ్వసంచార్ హిందుత్వ కా' గ్రంథం భారతీయ ఆలోచనల వ్యాప్తి, ప్రపంచంతో ఉన్న అనుబంధాలపై విశ్లేషణాత్మక దృక్పథాన్ని అందిస్తుందని కార్యక్రమంలో పాల్గొన్న పలువురు అభిప్రాయపడ్డారు. సాంస్కృతిక అధ్యయనాలు, చారిత్రక అంశాలపై ఆసక్తి ఉన్నవారికి ఈ పుస్తకం ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. భారతీయ దార్శనికత ప్రపంచవ్యాప్తంగా ఎలా ప్రభావం చూపిందో వివరిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వినోద్ తావ్డేతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. గ్రంథ రచన, ప్రచురణకు కృషి చేసిన వారిని ఈ సందర్భంగా అభినందించారు. పుస్తకావిష్కరణ అనంతరం అతిథులు గ్రంథంలోని అంశాలపై చర్చించారు. భారతీయ సాంస్కృతిక వారసత్వంపై మరింత అధ్యయనం, పరిశోధనలకు ఇటువంటి ప్రచురణలు ప్రేరణగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు. ఉపరాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమం సాహిత్య, సాంస్కృతిక రంగాలకు చెందిన పలువురి సమక్షంలో నిర్వహించబడింది. భారతదేశం ప్రపంచంతో కలిగి ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలపై చర్చను విస్తృతం చేసే ప్రయత్నంగా ఈ గ్రంథాన్ని పేర్కొన్నారు. భవిష్యత్తు తరాలకు దేశ సంస్కృతి, విలువలపై అవగాహన కల్పించడంలో ఇటువంటి పుస్తకాలు కీలక పాత్ర పోషిస్తాయని కార్యక్రమంలో వక్తలు తెలిపారు.

# ఆర్వో వాటర్.. వద్దే వద్దు!

మొదటి పేజీ తరువాయి




వంటి పదార్థాల స్థాయిలను కూడా తగ్గించవచ్చు. ఏ పదార్థం ఎంతవరకు తొలగుతుందనేది ఉపయోగిస్తున్న యంత్రం, దాని పొర, నీటి స్వభావంపై ఆధారపడి ఉంటుంది. అంటే నీటిలో ఉన్న ప్రతి ఖనిజం మలినం కాదు. శరీరానికి అవసరమైన కాల్షియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు నీటిలో సహజంగా ఉంటాయి. నీటిలో వాటి పరిమాణం ఆహారంతో పోలిస్తే తక్కువైనా, తాగునీరు కూడా వాటి లభ్యతకు కొంత మేర దోహదం చేస్తుంది.

### నీరు బాగుంటే ఆర్వో ఎందుకు?

ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతుంది. ఒక ప్రాంతంలో సరఫరా అవుతున్న నీటిలో ప్రమాదకరమైన కలుషితాలు ఉన్నాయా? భూగర్భజలాల్లో ఫ్లోరైడ్, నైట్రేట్, అధిక లవణాలు లేదా భార లోహాల సమస్య ఉందా? అనే విషయాన్ని తెలుసుకోకుండా కేవలం 'ఆర్వో ఉంటే నీరు సురక్షితం' అనే భావనతో యంత్రాన్ని ఏర్పాటు చేసుకోవడం సరైన విధానం కాదు. నీటిలో సూక్ష్మజీవుల సమస్య ఉంటే ఒక రకమైన శుద్ధి అవసరం కావచ్చు. అధిక లవణాలు లేదా నిర్దిష్ట రసాయన కాలుష్యం ఉంటే మరో రకమైన శుద్ధి అవసరం కావచ్చు. ఆర్వో ప్రతి పరిస్థితికి తప్పనిసరి పరిష్కారం కాదు.

### డబ్ల్యూహెచ్‌వో ఏమంటోందంటే..

సాధారణంగా తాగునీటిలో లీటరుకు 100 నుండి 300 మిల్లీగ్రాముల వరకు టీడీఎస్ ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) సూచిస్తోంది. అయితే, చాలా ఇళ్లలో ఆర్వో సిస్టమ్స్ ఈ స్థాయిని 50 కంటే తక్కువకు పడిపోయేలా చేస్తున్నాయి. అందుకే కేంద్ర పర్యావరణ శాఖ కూడా గతంలో తక్కువ టీడీఎస్ ఉన్న ప్రాంతాల్లో ఆర్వో వాటర్ ప్యూరిఫైయర్ల వాడకంపై ఆంక్షలు విధించింది. నీరు ఉప్పగా లేనప్పుడు టీడీఎస్ స్థాయిలు 500 వరకు ఉన్నా ప్రమాదం లేదని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. ఆర్వో వాటర్ సురక్షితమా? కాదా? అని కాకుండా, శరీరానికి ఏస్థాయిలో లవణాలు అందుతున్నాయది చాలా ముఖ్యం. అందువల్ల నీటిలో బ్యాక్టీరియా లాంటివి ఉంటే బాగా కాచి, చల్లార్చి వడపోస్తే చాలా మంచిదని స్పష్టం చేస్తున్నారు.

### నీటి వృథా అధికం

ఆరోగ్య అంశంతో పాటు పర్యావరణ కోణం కూడా ఉంది. ఆర్వో ప్రక్రియలో శుద్ధి చేసిన నీటితోపాటు ఎక్కువ కరిగిన పదార్థాలు కలిగిన మరో నీటి ప్రవాహం ఉత్పత్తి అవుతుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆర్వో వంటి పొర ఆధారిత శుద్ధి విధానాల్లో శుద్ధి చేసిన నీటితో పాటు అధిక సాంద్రత కలిగిన వ్యర్థ నీటి ప్రవాహం ఏర్పడుతుంది. నీటిలోని ప్రమాదకర పదార్థాలను తొలగించడం అత్యవసరమే. కానీ నీటిలో సహజంగా ఉండే ఉపయోగకరమైన ఖనిజాలను కూడా విచక్షణ లేకుండా తొలగించడం సరైన విధానం కాదు. నీటి నాణ్యతను పరీక్షించి.. అవసరమైనంత మాత్రమే శుద్ధి చేసి.. తగిన ఖనిజ సమతుల్యతను కాపాడే విధానమే ఆరోగ్యకరమైన మార్గం.

(పీఐబీ హైదరాబాద్, కోల్‌కతా వారి సహకారంతో..)



# కుండపోత..!

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (ఈవార్తలు): తెలంగాణలో శుక్రవారం అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ 5 జిల్లాలకు రెడ్ అలర్ట్, 8 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు పడతాయని అంచనా వేస్తూ రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఆదిలాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మిగతా జిల్లాలకు ఎల్లో అలర్ట్ కొనసాగుతోంది.

# '22ఏ'లో ఉన్నా రిజిస్ట్రేషన్

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లోని అనేక హౌసింగ్ కాలనీల నివాసితులకు ఈ నిర్ణయం పెద్ద ఉపశమనం కలిగించనుంది. చాలాకాలంగా స్తంభించిపోయిన స్థిరాస్తి లావాదేవీలు తిరిగి ఊపందుకుంటాయని భావిస్తున్నారు. ఈ ప్రయోజనం పొందాలనుకునే యజమానులు సంబంధిత పత్రాలతో అధికారులకు దరఖాస్తు చేసుకుని, తమ ఆస్తులపై ఉన్న రిజిస్ట్రేషన్ ఆంక్షలను తొలగించుకోవచ్చని రెవెన్యూ శాఖ సూచించింది. మరోవైపు, 22ఏ భూముల అంశంపై అసెంబ్లీలో జరిగిన చర్చ అనంతరం ప్రభుత్వం ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో రాజీవ్‌గాంధీ హనుమంతు, సందీప్‌కుమార్ ఝా సభ్యులుగా ఉంటారు. ఆయా జిల్లాల కలెక్టర్లు కూడా ఈ కమిటీలో భాగస్వాములుగా ఉంటారు. 22ఏ భూముల విషయంలో జరిగిన అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై ఈ కమిటీ విచారణ చేపట్టనుంది. ఈ కమిటీ పరిధి కేవలం 22ఏ అంశానికే పరిమితం కాదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# ఎమ్మెల్యేగా ఫిక్స్‌డ్ డిపాజిట్.. ఎంపీగా షేర్ మార్కెట్‌లో!



మొదటి పేజీ తరువాయి

సమర్థించింది. ఉప ఎన్నికల్లో పోటీ చేయాలని ఆయనకు సూచించింది.

### అద్భుతమైన తీర్పు: కౌశిక్‌రెడ్డి

దానంపై అనర్హత వేటును తమ పార్టీ విజయంగా వర్ణించారు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి. సుప్రీంకోర్టు ఆదేశాలను అద్భుతమైన తీర్పుగా ఆయన వర్ణించారు. దానంపై మొదటి నుంచి తామే పోరాటం చేశామని, ఇప్పుడు బీజేపీ వచ్చి క్రెడిట్ కొట్టేయాలని చూస్తోందని విమర్శించారు.

### చారిత్రక విజయం: రాంచంద్రరావు

ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతపై హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు సమర్థించడాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు స్వాగతించారు. ఈ తీర్పు ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ నైతికతకు చారిత్రక విజయంగా ఆయన పేర్కొన్నారు. బీజేఎల్పీ చేసిన న్యాయపోరాటం వల్లే ఈ విజయం సాధ్యమైందని అన్నారు.

కోర్టు తీర్పు ఇలా వస్తుందని తెలుసు: దానం

ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ సుప్రీంకోర్టు తీర్పుపై స్పందించారు. అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సంపూర్ణంగా గౌరవిస్తున్నానని తెలిపారు. చట్టపరమైన ప్రక్రియ పట్ల ఉన్న గౌరవంతోనే తాను న్యాయపోరాటం చేశానని చెప్పారు. ఇక తన భవిష్యత్తును ప్రజా క్షేత్రంలోనే తేల్చుకుంటానని స్పష్టం చేశారు. "కోర్టు తీర్పు ఇలా వస్తుందని ముందే ఊహించాను. అయితే రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ నిబంధనల ప్రకారం కొంత ఊరట లభిస్తుందని భావించాను. అందుకే చట్టపరంగా చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేశాను" అని దానం నాగేందర్ పేర్కొన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైన నేపథ్యంలో తాను సిద్ధంగా ఉన్నట్లు దానం తెలిపారు. ఖైరతాబాద్ ప్రజలతో తనకు దశాబ్దాలుగా అనుబంధం ఉందన్నారు. నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో ఎప్పుడూ వారికి అండగా ఉన్నానని చెప్పారు. రాబోయే ఉప ఎన్నికల్లో ప్రజల్లోకి వెళ్లి వారి ఆశీర్వాదం కోరతానన్నారు. ప్రజల మద్దతు తనకే ఉంటుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

# సీఈసీ అభిశంసనకు విపక్షాల కసరత్తు

మొదటి పేజీ తరువాయి

తెలిపింది. ఈ అభ్యంతరాలను ఆధారంగా చేసుకుని సీఈసీపై చర్యలకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. అయితే, ఎన్నికల కమిషన్ మాత్రం ఈ నివేదికలపై వివరణ ఇచ్చింది. ఎస్ఐఆర్‌తో పాటు కమిషన్ తీసుకున్న నిర్ణయాలన్నింటికీ ముగ్గురు ఎన్నికల కమిషనర్ల ఆమోదం ఉందని స్పష్టం చేసింది. కమిషనర్ల మధ్య అభిప్రాయాలు, సూచనలు ఉండటం సాధారణ ప్రక్రియలో భాగమేనని పేర్కొంది.

ప్రతిపక్షాలు మాత్రం ఈ పరిణామాలపై సీఈసీ జ్ఞానేశ్ కుమార్ బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికే ఈ ఏడాది మార్చి 12, ఏప్రిల్ 24 తేదీల్లో సీఈసీపై అభిశంసన నోటీసులు ఇచ్చినట్టు హిందుస్థాన్ టైమ్స్ నివేదించింది. తాజా పరిణామాలతో ఈ అంశం మరోసారి పార్లమెంటులో చర్చకు వచ్చే అవకాశం ఏర్పడింది.

# ట్యాంక్ బండ్‌పై హిట్ అండ్ రన్

**ఎస్సై వెంకన్న మృతి.. నిందితుడి కోసం గాలింపు**

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (ఈవార్తలు): భాగ్యనగర గణేశ్ నిమజ్జన బందోబస్తు విధుల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. హైదరాబాద్‌లో గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన ఓ సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) చికిత్స పొందుతూ మృతిచెందారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టూటౌన్ ఠాణాలో ఎస్సైగా పనిచేస్తున్న కె. వెంకన్న (57) ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. వరంగల్ జిల్లాకు చెందిన ఆయన, గణేశ్ నిమజ్జన బందోబస్తు కోసం ప్రత్యేకంగా హైదరాబాద్‌కు వచ్చారు. వివరాల్లోకి వెళితే, ఎన్టీఆర్ గార్డెన్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద ఎస్సై వెంకన్నకు విధులు కేటాయించారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 2 గంటల సమయంలో, సచివాలయం వైపు నుంచి అంబేద్కర్ విగ్రహం వైపు వేగంగా, నిర్లక్ష్యంగా వస్తున్న ఓ ద్విచక్ర వాహనదారుడు వెంకన్నను బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఎస్సై రోడ్డుపై పడిపోగా తల, కుడి మోకాలు, కుడి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన వ్యక్తి వాహనంతో సహా అక్కడి నుంచి పరారయ్యాడు. ప్రమాదం అనంతరం, వెంకన్నను లక్డీకాపూల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. కాస్త కోలుకున్న తర్వాత ఆయన సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఘటనపై ఫిర్యాదు చేసి, అనంతరం తన స్వగ్రామమైన కిష్టాపురానికి బయలుదేరారు. అయితే, గ్రామానికి చేరుకున్నాక మధ్యాహ్నం తర్వాత ఆయన ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించింది. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించగా, తలలో తీవ్ర రక్తస్రావం జరిగినట్లు వైద్యులు నిర్ధారించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకన్న కన్నుమూశారు. ఈ ఘటనపై సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న నిందితుడి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.



మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.



## యాదాద్రి ప్లాంట్‌లో బొగ్గు కొరత: జగదీశ్ రెడ్డి

నల్లగొండ, సెప్టెంబర్ 24 (ఈవార్తలు): నల్గొండ జిల్లా దామరచర్ల మండలంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లో ఎదురవుతున్న బొగ్గు కొరతకు, విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడానికి రాష్ట్ర ప్రభుత్వం, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని మాజీ మంత్రి, సూర్యాపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ ప్రతినిధుల బృందంతో కలిసి ఆయన ఈరోజు యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను స్వయంగా పరిశీలించారు. అనంతరం ప్లాంట్ అధికారులతో సమావేశమై విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడానికి గల సాంకేతిక, పరిపాలనాపరమైన కారణాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. సింగరేణి సంస్థ నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేస్తున్నప్పటికీ, ప్లాంట్లకు సక్రమంగా సరఫరా చేయకుండా దాదాపు 40 లక్షల టన్నుల బొగ్గును పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. తెలంగాణలోని పవర్ ప్లాంట్లకు బొగ్గు కొరత సృష్టించి, ప్రజలను ముఖ్యంగా రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఏ విధంగానైతే 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్‌ను అందించిందో, అదే రీతిలో పవర్ ప్లాంట్లకు పూర్తిస్థాయిలో బొగ్గు సరఫరా చేసి నిరంతర విద్యుత్ అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

# స్థానికానికి గెట్ రెడీ: జగన్



తాడేపల్లి, సెప్టెంబర్ 24 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు వైసీపీ శ్రేణులు పూర్తిస్థాయిలో సమాయత్తం కావాలని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైసీపీ రీజనల్ కో-ఆర్డినేటర్లతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన రాబోయే ఎన్నికల కార్యాచరణపై విస్తృతంగా చర్చించి నేతలకు దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి వీలైనంత త్వరగా ప్రజాదరణ కలిగిన మంచి అభ్యర్థులను గుర్తించాలని స్పష్టం చేశారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఏకపక్షంగా కాకుండా పార్టీలోని ప్రతి ఒక్కరి అభిప్రాయాలను సేకరించి, పలు దఫాలుగా విస్తృత చర్చలు జరిపిన తర్వాతే తుది జాబితాను ఖరారు చేయాలని ఆదేశించారు. ఇప్పుడు ఎంపిక చేసే అభ్యర్థులు రాబోయే సాధారణ ఎన్నికలకు బలమైన పునాదిగా నిలుస్తారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రెండున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైందని జగన్ ఆరోపించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల వల్ల ప్రజలకు జరుగుతున్న కష్టాలు, మోసాలను ప్రతి గడప వద్దకూ వెళ్లి వివరించాలని కేడర్‌కు సూచించారు. వైసీపీ హయాంలో అందించిన సంక్షేమాన్ని ప్రజలకు గుర్తు చేస్తూనే, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. స్థానిక ఎన్నికల్లో గెలిచేందుకు ప్రభుత్వం అధికార బలంతో పాటు పోలీసు వ్యవస్థను ఉపయోగిస్తూ అనేక అడ్డదారులు తొక్కుతుందని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఎలాంటి కుట్రలు ఎదురైనా తట్టుకునేలా పార్టీ శ్రేణులు ముందస్తుగా సిద్ధంగా ఉండాలని, రీజినల్ కో-ఆర్డినేటర్లు ప్రత్యామ్నాయ ప్రణాళికలు కూడా సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అట్టహాసంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు కేశినేని చిన్ని వెల్లడించారు.

## పింఛనుదారులకు గుడ్‌న్యూస్..

సమ్మె కారణంగా ప్రభుత్వ రంగ బ్యాంకులకు వరుస సెలవుల ఉన్నా పింఛనుదారులకు ఎటువంటి ఇబ్బంది ఉండని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. గురువారం రాజధాని అమరావతిలో ఆయన మాట్లాడుతూ.. అక్టోబర్1వ తేదీ మధ్యాహ్నం నుంచే ఇంటింటికీ పింఛన్ల పంపిణీ చేపడతామని తెలిపారు. అక్టోబర్ 1 ఉదయం నగదు విత్‌డ్రా చేసుకునేలా బ్యాంకులకు ఎస్‌ఎల్‌బీసీ ఆదేశాలు ఇచ్చిందని అన్నారు. ఉదయం బ్యాంకుల నుంచి నగదు తీసుకుని మధ్యాహ్నం నుంచే ఇంటింటికీ పింఛన్ల పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ పంపిణీ విధానంలో మార్పును గమనించి సహకరించాలని ఈ సందర్భంగా పింఛనుదారులకు మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. 61.80 లక్షల మంది పింఛనుదారుల కోసం రూ. 2,692.34 కోట్లు విడుదల చేస్తున్నట్లు వివరించారు.

# రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డికి బెయిల్

అమరావతి, సెప్టెంబర్ 24 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం (లిక్కర్ స్కామ్) కేసులో కీలక నిందితులైన రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డిలకు ఊరట లభించింది. ఈ కేసులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డిలకు ఈడీ స్పెషల్ కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. గురువారం ఈ మేరకు కోర్టు తీర్పు వెలువరించింది. బెయిల్ మంజూరు సందర్భంగా న్యాయస్థానం పలు కఠినమైన షరతులను విధించింది. నిందితులు దేశం విడిచి వెళ్లరాదని, సాక్షులను ప్రభావితం చేయకూడదని స్పష్టం చేసింది. అలాగే దర్యాప్తును ప్రభావితం చేసే ఎలాంటి చర్యలకు పాల్పడరాదని ఆదేశించింది. ఇద్దరు నిందితులు లక్ష రూపాయల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది. వీరిద్దరూ దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు పిలిచినప్పుడు తప్పనిసరిగా హాజరుకావాలని కోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, బెయిల్ ప్రక్రియ పూర్తి చేసుకుని శుక్రవారం ఉదయం వీరిద్దరూ చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో మద్యం కుంభకోణం జరిగినట్టు ఆరోపణలు రాగా, ఏపీ సీఐడీ నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ రంగంలోకి దిగిన విషయం తెలిసిందే. ఈ స్కామ్‌లో కోట్ల రూపాయల అక్రమ లావాదేవీలు జరిగాయన్న ఆరోపణలపై దర్యాప్తు చేపట్టిన ఈడీ, రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డిలను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించింది. తాజాగా వీరికి బెయిల్ లభించడంతో ఈ కేసులో తదుపరి పరిణామాలు ఆసక్తికరంగా మారాయి.



# హైదరాబాదులో ఘనంగా షర్మిల కుమార్తె నిశ్చితార్థం

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఇంట పెళ్లి సందడి మొదలైంది. ఆమె కుమార్తె అంజిలి రెడ్డి, సోమల రఘురామ్ రెడ్డిల నిశ్చితార్థ వేడుక గురువారం హైదరాబాద్ శివారులోని కొత్వాల్‌గూడలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతీసమేతంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాబోయే వధూవరులను ఆయన ఆశీర్వదించారు. ఈ నిశ్చితార్థ వేడుకలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహా పలువురు రాజకీయ ప్రముఖులు, కుటుంబ సభ్యులు, ఆత్మీయులు పాల్గొన్నారు. నూతన జంటకు వారు శుభాకాంక్షలు తెలియజేశారు. కుటుంబ సభ్యుల మధ్య ఈ వేడుక వైభవంగా జరిగింది. కాగా, తన కుమార్తె వివాహానికి సంబంధించిన కీలక తేదీలను షర్మిల కొద్ది రోజుల క్రితమే స్వయంగా ప్రకటించారు. సెప్టెంబర్ 24న నిశ్చితార్థం, నవంబర్ 25న వివాహం, డిసెంబర్ 5న రిసెప్షన్ ఉంటుందని ఆమె ఎక్స్ వేదికగా వెల్లడించారు. వివాహ వేడుకకు సంబంధించిన మొదటి ఆహ్వాన పత్రికను ఇడుపులపాయలోని తన తండ్రి, దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఘాట్ వద్ద ఉంచి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ క్రమంలో, వివాహ ఆహ్వానం కోసం తన సోదరుడు వైఎస్ జగన్‌ను కలవడంపై వస్తున్న రాజకీయ ఊహాగానాలను షర్మిల ఖండించారు. తన కుమార్తె వివాహానికి అన్ని రాజకీయ పార్టీల అధినేతలను ఆహ్వానిస్తానని, ఇందులో ఎలాంటి రాజకీయ కోణాలు చూడవద్దని ఆమె స్పష్టం చేశారు.

## తెలుగు రాష్ట్రాల బీజేపీ ప్రధాన కార్యదర్శిగా మధుకర్

న్యూఢిల్లీ: బీజేపీ తమ సంస్థాగత నిర్మాణంలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలకు కొత్త సంస్థాగత ప్రధాన కార్యదర్శులు, సంయుక్త ప్రధాన కార్యదర్శులను నియమించింది. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు కూడా కొత్త బాధ్యులను కేటాయించింది. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా మధుకర్‌ను నియమించారు. అదేవిధంగా, తెలంగాణ రాష్ట్ర సంయుక్త సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా వరంగల్ కేంద్రంగా పనిచేసేందుకు దశరథ్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ మార్పుల ద్వారా తెలుగు రాష్ట్రాల్లో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడంపై అధిష్టానం దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది. జాతీయ స్థాయిలోనూ పలు కీలక నియామకాలు జరిగాయి. జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా శివప్రకాశ్‌ను నియమించగా, ఆయనకు ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గోవా రాష్ట్రాల బాధ్యతలు అప్పగించారు. ఆయన ముంబై కేంద్రంగా పనిచేస్తారు.




# ఘనంగా వినాయక నిమజ్జనం



వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 24 (ఈవార్తలు): వేములవాడ పట్టణంలోని గుడిచెరువు బండ్ పార్క్ వద్ద వినాయక నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో నిమజ్జన కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది. కార్యక్రమానికి కలెక్టర్ గరిమ అగర్వాల్, ఎస్పీ మహేష్ బి. గీతే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గుడిచెరువు బండ్ పార్క్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఫౌంటెన్‌ను వారు ప్రారంభించారు. కిడ్స్ కాన్వెంట్ హైస్కూల్, గౌతమ్ మోడల్ స్కూల్, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు నిమజ్జనోత్సవానికి మరింత శోభను తీసుకువచ్చాయి. భక్తులు భక్తిశ్రద్ధలతో గణనాథుడికి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లోకేశ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పుల్కం రాజు, వైస్ చైర్‌పర్సన్ నరాల శేఖర్, వార్డు కౌన్సిలర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చిన్నారుల అద్భుత నాట్య ప్రదర్శన



వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 24 (ఈవార్తలు): వేములవాడ గుడిచెరువు బండ్ పార్క్‌లో నిర్వహించిన వినాయక నిమజ్జనోత్సవ సాంస్కృతిక కార్యక్రమాల్లో కిడ్స్ కాన్వెంట్ హైస్కూల్ చిన్నారులు అద్భుత నాట్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. చిన్నారుల నృత్య ప్రదర్శనను వీక్షించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వారిని అభినందించి ఆశీస్సులు అందజేశారు. ఇటువంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. చదువుతో పాటు కళలను నేర్చుకుని విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలనే ఉద్దేశంతో చిన్నారులను ప్రోత్సహిస్తున్నామని పాఠశాల కరస్పాండెంట్లు నరాల దేవేందర్, దరక్షన్ వస్ప్రియా తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, పలువురు పాల్గొని చిన్నారులను అభినందించారు.



# రేవంత్ సభా స్థలాన్ని పరిశీలించిన ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల బ్యూరో, సెప్టెంబర్ 24 (ఈవార్తలు): ఈ నెల 30న రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో సభా ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతేతో కలిసి సభా స్థలాన్ని పరిశీలించారు. సభా ప్రాంగణంలో వేదిక నిర్మాణం, ప్రజలు కూర్చునే ప్రాంతాలు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ మహేష్ బి. గీతేతో చర్చించారు. సభను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

# పంట అమ్ముకోవడానికీ యాప్‌లా?

**జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్**

జగిత్యాల, సెప్టెంబర్ 24 (ఈవార్తలు): రైతు పంట పండించడమే కాకుండా, దానిని అమ్ముకోవడానికి కూడా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ ఆరోపించారు. సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులకు సాగునీరు, సకాలంలో విద్యుత్ అందించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్, యాప్‌ల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. పంటలను రైతులు స్వేచ్ఛగా విక్రయించుకునేలా చర్యలు తీసుకోవాలని, గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. మూడు సంవత్సరాలకు సంబంధించిన ఆరు పంటల బోనస్‌ను రైతులకు చెల్లించాలని కోరారు. ఎలినో ప్రభావంపై ముందస్తు హెచ్చరికలు ఉన్నప్పటికీ ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని వినియోగించి రైతులకు సాగునీరు అందించాలని కోరారు.





గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని ఫసల్ బీమా యోజన అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటం ఉద్ధృతం చేస్తామని దావ వసంత సురేష్ హెచ్చరించారు. సమావేశంలో మండల అధ్యక్షుడు తేలు రాజు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సాగి సత్యంరావు, పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# వర్షాలతో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు వాయిదా

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 24 (ఈవార్తలు): వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 26 నుంచి 29 వరకు నిర్వహించాల్సిన రాష్ట్రస్థాయి పురుషుల, మహిళల కబడ్డీ పోటీలు వాయిదా పడ్డాయి. గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో పోటీల నిర్వహణకు మైదానం, క్రీడాకారుల వసతి, భోజన సదుపాయాలు తదితర ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయని నిర్వాహకులు తెలిపారు. అయితే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో క్రీడా ప్రాంగణం బురదమయంగా మారిందని చెప్పారు. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో క్రీడాకారులకు గాయాలయ్యే అవకాశం ఉందని, వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పోటీలను వాయిదా వేసినట్లు వివరించారు. రాష్ట్ర కబడ్డీ సంఘం అనుమతితో, ఆది శ్రీనివాస్ సూచనల మేరకు అక్టోబర్ 1 నుంచి 4 వరకు పోటీలను వేములవాడలోనే నిర్వహించేలా తేదీలను మార్చినట్లు తెలిపారు. ఈ సమాచారాన్ని రాష్ట్రంలోని 33 జిల్లాల కబడ్డీ సంఘాలు, ఆయా జట్లకు ఇప్పటికే తెలియజేశామన్నారు. పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కబడ్డీ సంఘం ఉపాధ్యక్షుడు సీహెచ్. సంపత్‌రావు, జిల్లా అధ్యక్షుడు ముస్కు మల్లారెడ్డి, కార్యదర్శి సింగారపు తిరుపతి, కబడ్డీ సలహాదారు నాగుల లక్ష్మీనారాయణ, సంయుక్త కార్యదర్శి సోమినేని బాలు, పొత్తూరి నరేష్, బండారి సాయి తదితరులు పాల్గొన్నారు.



# సర్వాపూర్‌లో రహదారి నరకం

మల్యాల, సెప్టెంబర్ 24 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం సర్వాపూర్ గ్రామంలోని ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. భారీ గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో రహదారి చెరువును తలపిస్తోంది. చుట్టూ బురద పేరుకుపోవడంతో వాహనదారులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. గుంతల్లో నీటి లోతు తెలియక బైకులు, ఆటోలు ఇరుక్కుపోతున్నాయని గ్రామస్తులు తెలిపారు. కార్ల రాకపోకలకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. పాఠశాల విద్యార్థులు, వృద్ధులు, మహిళలు ఈ మార్గంలో ప్రయాణించాలంటే భయపడే పరిస్థితి ఉందన్నారు. రోడ్డు దుస్థితిపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సరైన మురుగునీటి పారుదల వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు రోడ్డుపైనే నిలిచిపోతోందన్నారు. రహదారి మరమ్మతులు చేపట్టకపోవడంతో పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోందని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి గుంతలను పూడ్చడంతో పాటు రహదారి మరమ్మతులు, మురుగునీటి పారుదల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరారు.



# 1,993 రోజులుగా అన్నదాన సేవలు





వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 24 (ఈవార్తలు): దాతల సహకారంతో భీమేశ్వర ఆలయం వద్ద నిరుపేదలు, అన్నార్తులు, భక్తులకు 1,993 రోజులుగా నిర్విరామంగా అన్నదాన సేవలు కొనసాగుతున్నాయని ట్రస్టు నిర్వా హకులు మధు మహేష్ తెలిపారు. ఇందులో భాగంగా గురువారం 150 మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి నేటి అన్నదాతలుగా ముంబైకి చెందిన నడిమెట్ల ఎల్లప్ప-భారతి దంపతులు సహకరించగా, అన్నదాన శాశ్వత సభ్యులుగా డాక్టర్ జువ్వాడి వెంకటేశ్వరరావు-స్నేహలత, ప్రతాప స్వప్న-సంపత్, గణాచారి మఠం శైలజ-సాంబశివు, దేవరాజు ఉమ-బాలచందర్ రాజు తదితరులు ఉన్నారు. రామడుగు శ్రీలత కుటుంబ సభ్యులు కూడా సేవకు సహకరించారు. పుట్టి నరోజు, వివాహ వార్షికోత్సవం తది తర సందర్భాల్లో నిరుపేదలకు ఒక్క పూట అన్నదానం చేయాలనుకునే దాతలు ట్రస్టును సంప్రదించాలని మధు మహేష్ కోరారు. వివరాలకు 9246939388ను సంప్రదించవచ్చన్నారు

# కొండగట్టులో పవిత్రోత్సవాలకు ఏర్పాట్లు

మల్యాల, సెప్టెంబర్ 24 (ఈవార్తలు): కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు మూడు రోజులపాటు ఘనంగా నిర్వహిస్తున్నారు. తొలిరోజు సాయంత్రం విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, యాగశాల శుద్ధి, అంకురార్పణ కార్యక్రమాలతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. యాగశాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు మూలమంత్రాలతో పవిత్రాల పవిత్రీకరణ కార్యక్రమం చేపట్టారు. శనివారం మహాపూర్ణాహుతి అనంతరం స్వామివారికి, అర్చకులకు, ఆలయ సిబ్బందికి, భక్తులకు పవిత్ర ప్రదానం చేయనున్నారు. అనంతరం మహదాశీర్వచనం నిర్వహించనున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.



# పకడ్బందీగా రీ సర్వే పనులు: సత్యప్రసాద్

జగిత్యాల, సెప్టెంబర్ 24 (ఈవార్తలు): భూముల రీ సర్వే పనులను పకడ్బందీగా, వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం బీర్‌పూర్ మండలం మోతీనగర్, డొంకేశ్వర్ గ్రామాల్లో కొనసాగుతున్న నాన్ కెడస్ట్రాల్, ఎంజాయ్‌మెంట్ రీ సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన సర్వే, ఇంకా చేపట్టాల్సిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వే నంబర్ల వారీగా ఎలాంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితత్వంతో సర్వే నిర్వహించాలని సూచించారు. గ్రామ సరిహద్దులను ముందుగా నిర్ధారించి, లైసెన్స్డ్, మండల సర్వేయర్లతో రీ సర్వే చేపట్టి అనంతరం రైతువారీగా సర్వే నిర్వహించాలని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక పరికరాలను వినియోగించి పారదర్శకంగా పనులు చేపట్టాలన్నారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో ప్రభుత్వం రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని పేర్కొన్నారు. జగిత్యాల జిల్లాలో తొలి విడతగా 70 గ్రామాల్లో రీ సర్వే చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. అనంతరం బీర్‌పూర్ కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థుల హాజరు, బోధన వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్, సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జనం వేళ విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ఎండపల్లి, సెప్టెంబర్ 24 (ఈవార్తలు): వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిమజ్జన ఏర్పాట్లు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఎండపల్లి మండలం కొత్తపేటలో చోటుచేసుకుంది. గ్రామంలోని రెండో వార్డు మాల కమ్యూనిటీ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద బుధవారం రాత్రి ఈ ఘటన జరిగింది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. నిమజ్జన ఏర్పాట్లలో భాగంగా మండపానికి విద్యుత్ సరఫరా చేస్తున్న వైర్‌ను తొలగించేందుకు కొప్పుల రాజశేఖర్ ప్రయత్నించారు. కర్రతో వైర్‌ను తొలగించే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రాజశేఖర్ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు.



# ముస్లిం సెంట్రల్ ఎన్నికల కమిటీ రద్దు

జగిత్యాల, సెప్టెంబర్ 24 (ఈవార్తలు): జగిత్యాల ముస్లిం సెంట్రల్ కమిటీ ఎన్నికల ప్రక్రియ పూర్తికావడంతో ఎన్నికల కమిటీని రద్దు చేసినట్లు ఎన్నికల కమిషనర్ మహ్మద్ ఇమ్రాన్ తెలిపారు. గురువారం నిర్వహించిన ఎన్నికల కమిటీ సమావేశంలో సభ్యుల నిర్ణయం మేరకు కమిటీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ఎన్నికల కమిటీ రద్దు పత్రాన్ని ముస్లిం సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు ఎంఎ. బారీకి అందజేశారు. ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన ఎన్నికల కమిటీ సభ్యులకు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.



# నేస్తం యూత్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

వేములవాడ రూరల్, సెప్టెంబర్ 24 (ఈవార్తలు): నూకలమర్రి గ్రామంలోని నేస్తం యూత్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉప్పుల గౌతమ్, ఉపాధ్యక్షుడిగా ఊరడి బాపురెడ్డి, ఖజానాదారుగా జంగం హరీష్, కార్యదర్శిగా ఉప్పుల రఘు, సహాయ కార్యదర్శిగా ఉప్పుల శంకర్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా జంగం వంశీ, పులి గణేష్‌ను ఎంపిక చేశారు. యువతను సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తూ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. వారికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

# మతసామరస్యానికి ప్రతీకగా గణపతి లడ్డు

జగిత్యాల, సెప్టెంబర్ 24 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని గోవిందుపల్లె టీం సెవెన్ యూత్ గణేష్ మండపం మతసామరస్యానికి వేదికగా నిలిచింది. పది రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణపతి చేతిలోని లడ్డును గురువారం నిర్వాహకులు వేలం వేశారు. ఇందులో గణేష్‌నగర్‌కు చెందిన మహమ్మద్ ఇషాన్ రూ.70 వేలకు లడ్డును దక్కించుకున్నారు. ప్రముఖ గాయకుడు ఎం.డీ. అభి కుమారుడైన ఇషాన్ చిన్ననాటి నుంచే స్నేహితులతో కలిసి గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఉత్సవాల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొనడంతోపాటు ఉపవాస దీక్ష కూడా చేపడుతున్నట్లు తెలిపారు. ఈసారి లడ్డును వేలంలో దక్కించుకోవడంపై పలువురు ఇషాన్‌ను అభినందించారు. కులమతాలకు అతీతంగా ఇతర మతాలను గౌరవించాలనే సందేశాన్ని ఆయన చాటారని పేర్కొన్నారు.





## బల్క్ డిపాజిట్లపై
# ఆర్బీఐ కీలక మార్పులు

న్యూఢిల్లీ: దేశంలోని బ్యాంకింగ్ వ్యవస్థలో పారదర్శకతను పెంచే దిశగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఫిక్స్‌డ్ డిపాజిట్లకు సంబంధించి కొత్త నిబంధనలను జారీ చేసింది. ఈ మార్పులు 2026 అక్టోబర్ 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. ప్రధానంగా రూ.3 కోట్లు, అంతకంటే ఎక్కువ విలువైన 'బల్క్ డిపాజిట్ల'ను లక్ష్యంగా చేసుకుని ఈ మార్గదర్శకాలను రూపొందించారు. సాధారణ, చిన్న మొత్తాల్లో డిపాజిట్లు చేసే రిటైల్ కస్టమర్లపై ఈ నిబంధనల ప్రభావం దాదాపుగా ఉండదని ఆర్బీఐ స్పష్టం చేసింది. ఆర్బీఐ తాజా నిబంధనల ప్రకారం, ఇకపై రూ.3 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ మొత్తంలో చేసే సింగిల్ టర్మ్ డిపాజిట్‌ను 'బల్క్ డిపాజిట్'గా పరిగణిస్తారు. ఇప్పటివరకు ఈ పరిమితి తక్కువగా ఉండేది. ఈ బల్క్ డిపాజిట్లపై వేర్వేరు వడ్డీ రేట్లను (డిఫరెన్షియల్ రేట్స్) ఆఫర్ చేసేందుకు బ్యాంకులకు మరింత వెసులుబాటు కల్పించారు. లిక్విడిటీ కవరేజ్ రేషియో ఫ్రేమ్‌వర్క్‌కు అనుగుణంగా, తమ అవసరాలకు తగ్గట్టుగా వడ్డీ రేట్లను నిర్ణయించుకునే స్వేచ్ఛను బ్యాంకులకు ఇచ్చారు.

## మల్యాల పీహెచ్‌సీలో స్వీపర్‌తో డ్రెస్సింగ్?



మల్యాల, సెప్టెంబర్ 24 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు స్వీపర్ డ్రెస్సింగ్ చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. స్టాఫ్ నర్సుల విధుల నిర్వహణపై విమర్శలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో జగిత్యాల జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్ పీహెచ్‌సీని సందర్శించి ఘటనపై విచారణ చేపట్టారు. వీడియోలోని ఘటనకు సంబంధించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీహెచ్‌సీలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై వివరాలు సేకరించారు. ఘటనకు సంబంధించిన వాస్తవాలను పరిశీలిస్తున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో తెలిపారు.

## భారీ వర్షాలున్నాయ్.. జాగ్రత్త

జగిత్యాల, సెప్టెంబర్ 24 (ఈవార్తలు): బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం ప్రభావంతో రానున్న మూడు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ, అక్కడక్కడా అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో విద్యుత్ శాఖ అప్రమత్తమైంది. వర్షాలను ఎదుర్కొనేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ జగిత్యాల సర్కిల్ పూర్తి సన్నద్ధంగా ఉందని ఎస్ఈ బి.సుదర్శనం తెలిపారు. విద్యుత్ సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ సరఫరా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి 24 గంటలు పనిచేసే కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, వినియోగదారులు 8712486131 లేదా టోల్‌ఫ్రీ నంబరు 1912కు ఫిర్యాదు చేయాలని సూచించారు. వర్షాల కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడితే వెంటనే పునరుద్ధరించేందుకు విద్యుత్ స్తంభాలు, ఇతర సామగ్రిని సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో చెట్లు విరిగిపడి విద్యుత్ తీగలు తెగిపడగా, వాటిని యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నట్లు వెల్లడించారు. వర్షాల సమయంలో తెగిపడిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను తాకరాదని వినియోగదారులకు సూచించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఈ కోరారు.

# నిమిషంలోనే న్యూరో సమస్యలు తెలిసిపోతాయ్!

### పోర్టబుల్ న్యూరోలాజికల్ బయోమార్కర్ అభివృద్ధి.. త్వరలో అందుబాటులోకి వచ్చే అవకాశం

కోల్‌కతా, సెప్టెంబర్ 24 (పీఐబీ): నాడీ సంబంధిత ఆరోగ్య సమస్యలను చాలా వేగంగా, సులభంగా గుర్తించేందుకు సీఎస్ఐఆర్–సెంట్రల్ గ్లాస్ అండ్ సెరామిక్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీజీసీఆర్ఐ)–కోల్‌కతా శాస్త్రవేత్తలు సరికొత్త సాంకేతికతను అభివృద్ధి చేస్తున్నారు. 'న్యూర్‌ఆన్‌స్క్రీన్' పేరుతో రూపొందిస్తున్న ఈ పోర్టబుల్ పరికరం ద్వారా మూత్ర పరీక్ష సహాయంతోనే నాడీ సంబంధిత ఆరోగ్య పరిస్థితులను వైద్యులు వేగంగా అంచనా వేయటానికి ఉపయోగపడుతుంది. దీనివల్ల రోగులు ప్రత్యేక లాబొరేటరీల చుట్టూ తిరగాల్సిన అవసరం తప్పుతుంది.

**నిమిషంలోనే ఫలితాలు**

ఈ పరికరం నమూనాతో శరీరంలో సహజంగా ఉండే డొపమైన్ స్థాయిలను పరీక్షించవచ్చు. ఒక చుక్క శాంపిల్ సేకరించి ఈ పరికరానికి అనుసంధానించిన స్మార్ట్‌ఫోన్ ద్వారా పరీక్షిస్తే, నిమిషంలోపే ఫలితాలు స్క్రీన్‌పై ప్రత్యక్షమవుతాయి. వైద్యులు తదుపరి చికిత్స లేదా ఇతర పరీక్షల అవసరాన్ని త్వరగా నిర్ణయించడానికి ఈ సమాచారం ఎంతగానో దోహదపడుతుందని డాక్టర్ సోమనాథ్ రాయ్ (సీనియర్ ప్రిన్సిపల్ పరిశోధకుడు), డాక్టర్ స్వస్తిక్ మాండల్ తెలిపారు. ముఖ్యంగా అత్యాధునిక లాబొరేటరీ సేవలు అందుబాటులో లేని మారుమూల ప్రాంతాల ప్రజలకు ఈ పరికరం సంజీవనిలా మారనుంది. ప్రస్తుతానికి 'న్యూర్‌ఆన్‌స్క్రీన్' ఇంకా అభివృద్ధి దశలోనే ఉందని, సాధారణ వైద్య అవసరాల కోసం మార్కెట్లోకి తీసుకువచ్చే ముందు దీనిపై మరిన్ని క్లినికల్ పరీక్షలు చేయాల్సి ఉందని పరిశోధకులు స్పష్టం చేశారు. నాడీ సంబంధిత పరీక్షలను సామాన్యులకు మరింత చేరువ చేయడం, చికిత్సలో




జరిగే ఆలస్యాన్ని తగ్గించడం మరియు సకాలంలో సరైన వైద్య సహాయం అందించడమే ఈ ప్రాజెక్టు యొక్క ముఖ్య ఉద్దేశమని వారు తెలిపారు. ఈ సరికొత్త ఆవిష్కరణ వైద్య రంగంలో, ముఖ్యంగా న్యూరాలజీ విభాగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



# జిన్‌పింగ్‌కు ట్రంప్ విందు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రథమ మహిళ మెలనియా ట్రంప్.. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, ఆయన అర్ధాంగి మేడమ్ పెంగ్ లియువాన్‌లకు వైట్‌హౌస్‌లో (భారత కాలమానం ప్రకారం శుక్రవారం ఉదయం) ఘనంగా విందు ఇవ్వనున్నారు. అమెరికన్ పదార్థాలను చైనీస్ వంటకాల స్ఫూర్తితో మేళవించి రూపొందించిన ప్రత్యేక మెనూ ఈ విందుకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. వైట్‌హౌస్‌లోని ఈస్ట్ రూమ్‌లో ఈ విందు జరగనుంది. ఇరు దేశాల అధికారిక ప్రతినిధులతో పాటు ప్రముఖ వ్యాపారవేత్తలు, ప్రభుత్వ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ప్రథమ మహిళ మెలనియా ట్రంప్ కార్యాలయం విడుదల చేసిన వివరాల ప్రకారం, ఈ విందు ఏర్పాట్లన్నింటినీ ఆమె దగ్గరుండి పర్యవేక్షించారు. విందు ప్రారంభంలో 'ష్రామ్స్‌బర్గ్ బ్లాంక్ డి నోయిర్' అనే అమెరికన్ స్పార్క్లింగ్ వైన్‌తో టోస్ట్ చేయనున్నారు. 1972లో బీజింగ్‌లో నాటి అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్, చైనా ప్రధాని చౌ ఎన్‌లాయ్ మధ్య జరిగిన 'టోస్ట్ టు పీస్'కు గుర్తుగా ఇదే వైన్‌ను ఎంచుకున్నారు. విందులో భాగంగా తొలుత



ఎల్లో స్క్వాష్ వెలౌటే (సూప్)ను వడ్డించనున్నారు. దీనితో పాటు వైల్డ్ మష్రూమ్ ఫ్రికాసీ, క్రిస్పీ పాన్‌సెట్టా, స్కాలియన్ ఆయిల్‌ను అందిస్తారు. తియ్యటి పసుపు గుమ్మడికాయతో చేసిన ఈ సూప్ మృదువుగా ఉంటుందని, మూలికలతో వేయించిన పుట్టగొడుగులు ప్రత్యేక రుచినిస్తాయని వైట్‌హౌస్ వర్గాలు తెలిపాయి. పాన్‌సెట్టా స్మోకీ ఫ్లేవర్‌ను, స్కాలియన్ ఆయిల్ అదనపు పరిమళాన్ని అందిస్తాయి. ప్రధాన వంటకంగా నువ్వులతో కోటింగ్ చేసిన సీ బాస్ చేపను వడ్డించనున్నారు. దీనితో పాటు బేబీ బోక్ చోయ్, రోస్టెడ్ గార్డెన్ వంకాయ, గ్రీన్ హెర్బ్ సాస్‌ను అందిస్తారు. నువ్వుల పూత వల్ల చేప పైన కరకరలాడుతూ లోపల మృదువుగా ఉంటుందని నిర్వాహకులు వివరించారు. కూరగాయలు ఈ వంటకానికి మిశ్రమ అనుభూతినిస్తాయి. ఇక డెజర్ట్‌గా వెనిల్లా క్రీమ్, వైట్‌హౌస్ తేనెతో చేసిన ఐస్‌క్రీమ్‌ను వాల్‌నట్ ఫ్రాంజిపేన్, సోర్ చెర్రీ కాన్ఫిట్‌తో కలిపి అందించనున్నారు. చెర్రీ పండు ఆకారంలో ఉండే ఈ డెజర్ట్ మధ్యలో చెర్రీ కాన్ఫిట్ ఉంటుంది. దీనిలో ఉపయోగించే తేనెను వైట్‌హౌస్‌లోని తేనెటీగల నుంచి సేకరించడం విశేషం.

# అక్టోబరు 2న యూపీఐ చెల్లింపులు బంద్



న్యూఢిల్లీ: దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో కీలకమైన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిపే కొన్ని లావాదేవీలపై ఛార్జీలు విధించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై వ్యాపార వర్గాలు భగ్గుమన్నాయి. ఈ కొత్త నిబంధనలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అక్టోబర్ 2 (గాంధీ జయంతి) నాడు "నో యూపీఐ డే" పాటించాలని పలు వాణిజ్య, వ్యాపార సంఘాలు పిలుపునిచ్చాయి. ఆ రోజున తమ దుకాణాల్లోని యూపీఐ క్యూఆర్ కోడ్‌లు, స్కానర్లు, సౌండ్ బాక్సులను నల్లటి వస్త్రంతో కప్పివేసి నిరసన తెలపాలని నిర్ణయించాయి. అక్టోబర్ 15 నుంచి యూపీఐ చెల్లింపులకు సంబంధించి కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. దీని ప్రకారం, వ్యాపారులు (పర్సన్ టు మర్చంట్) స్వీకరించే రూ.2,000కు పైబడిన ప్రతి యూపీఐ లావాదేవీపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ (వీణ=) చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ఒక లావాదేవీపై గరిష్ఠంగా రూ.300 మాత్రమే ఛార్జ్ చేస్తారు.

## హిందూ మహా సముద్రం
# వరకు యుద్ధం

**ఇరాన్ సంచలన ప్రకటన**

**భారత్ ఇంధన దిగుమతులపై ప్రభావం**

న్యూఢిల్లీ: మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న సంక్షోభం మరింత విస్తరించే ప్రమాదం కనిపిస్తోంది. ఈ యుద్ధం హిందూ మహాసముద్రం వరకు కూడా వ్యాపించవచ్చని ఇరాన్ తీవ్ర



హెచ్చరికలు జారీ చేసింది. ఈ పరిణామం భారత్ ఇంధన దిగుమతులు, సముద్ర వాణిజ్యంపై తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఒకవేళ ఉద్రిక్తతలు హిందూ మహాసముద్రానికి వ్యాపిస్తే, అది భారత వాణిజ్య, ఇంధన భద్రతకు పెను సవాలుగా మారే అవకాశం ఉంది. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీకి సలహాదారుగా ఉన్న యహ్యా రహీం సఫావి ఈ హెచ్చరికలు జారీ చేశారు. అమెరికా లేదా ఇజ్రాయెల్ మరిన్ని దాడులకు పాల్పడితే, యుద్ధాన్ని మరింత విస్తృతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. "ఈ పోరాటం ఇప్పటికే పర్షియన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధి నుంచి ఎర్ర సముద్రానికి విస్తరించింది. యుద్ధం కొనసాగితే, హిందూ మహాసముద్రం, ఆపై ప్రాంతాలకు కూడా వ్యాపించే అవకాశం ఉంది" అని ఆయన పేర్కొన్నట్టు ఇరాన్‌కు చెందిన ఫార్స్ న్యూస్ ఏజెన్సీ ఓ వీడియోను విడుదల చేసింది. ఇరాన్ అత్యున్నత స్థాయి అధికారి ఒకరు హిందూ మహాసముద్రం గురించి ప్రస్తావించడం ఇదే తొలిసారి. ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధిపై ఇరాన్ ఆంక్షలు విధించగా, యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు ఎర్ర సముద్ర తీరం, కీలకమైన బాబ్ అల్–మందబ్ జలసంధిపై పట్టు బిగించారు. ప్రపంచ చమురు, గ్యాస్ రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిపై పట్టు కోసం ఇరాన్, అమెరికా పోటీ పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ తాజా హెచ్చరికలకు ప్రాధాన్యం ఏర్పడింది.



ఈవార్తలు
# వినోదవాణి
CINEMA
శుక్రవారం 25-9-2026, జగిత్యాల
www.evarthalu.com






## దయచేసి హెల్మెట్ పెట్టుకోండి: సాయి దుర్గ తేజ్

టాలీవుడ్ నటుడు సాయి దుర్గ తేజ్ ఐదేళ్ల క్రితం తాను ఎదుర్కొన్న ఘోర రోడ్డు ప్రమాదాన్ని గుర్తుచేసుకుంటూ నేడు ఓ భావోద్వేగ ప్రకటన విడుదల చేశారు. ప్రమాదం జరిగిన రోజును తన 'పునర్జన్మ దినం'గా పేర్కొంటూ, హెల్మెట్ పెట్టుకోవడం అనే ఒక్క చిన్న నిర్ణయం వల్లే తాను ఈ రోజు బతికున్నానని తెలిపారు. అభిమానులందరూ తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఆయన మనస్ఫూర్తిగా కోరారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో 'పునర్జన్మ-దినం' పేరుతో ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. "నా కుటుంబానికి, స్నేహితులకు, అభిమానులకు, ప్రతి సినీ ప్రేమికుడికి.. సరిగ్గా ఐదేళ్ల క్రితం మీ ప్రార్థనలు, ప్రేమ, బేషరతు మద్దతుతో నాకు రెండో జీవితం లభించింది. గాయాల నుంచి నేను 90% కోలుకున్నాను. ఇంకా నా మాటలో, మరికొన్ని ఇతర సవాళ్లలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాను. కానీ వాటిని అధిగమిస్తున్నాను. ఒక్కో అడుగు ముందుకు వేస్తున్నాను" అని పేర్కొన్నారు. "మీ ప్రేమ నన్ను ఎప్పుడూ వీడలేదు. ప్రతీ కష్టమైన రోజు, ఎదురైన ప్రతీ ఎదురుదెబ్బ, వదిలేయడం సులభం అనిపించిన ప్రతి క్షణంలోనూ నాకు అండగా నిలిచి బలాన్నిచ్చింది. ఐదేళ్ల తర్వాత ఇక్కడ ఉన్నాను. ఇంకా నిలబడి ఉన్నాను. పోరాడుతూనే ఉన్నాను. జీవిస్తూనే ఉన్నాను. మీ ప్రార్థనలకు, శుభాకాంక్షలకు, సందేశాలకు, మీరు చూపిన ప్రేమకు ధన్యవాదాలు. మీరు లేకుండా నేను ఇక్కడ ఉండేవాడిని కాదు" అని ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తన కథ నుంచి అభిమానులు ఒక ముఖ్యమైన విషయం నేర్చుకోవాలని ఆయన కోరారు. "దయచేసి హెల్మెట్ పెట్టుకోండి. ఆ ఒక్క చిన్న నిర్ణయమే నేను ఈ రోజు ఇక్కడ ఉండటానికి కారణం" అని తన ప్రకటనలో రాసుకొచ్చారు. సాయి దుర్గ తేజ్ 2021 సెప్టెంబర్‌లో హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. స్పోర్ట్స్ బైక్‌పై వెళుతుండగా అదుపుతప్పి కిందపడటంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆసుపత్రికి తరలించగా, వైద్యులు సకాలంలో చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు. ఇక, సినిమాల విషయానికొస్తే.. సాయి దుర్గ తేజ్ ప్రస్తుతం దర్శకుడు రోహిత్ కేపీ రూపొందిస్తున్న పాన్-ఇండియన్ చిత్రం 'సంబరాల ఏటి గట్టు'లో నటిస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది.



## శర్వానంద్ సరసన మానస వారణాసి

హీరో శర్వానంద్ కొత్త సినిమా 'జార్జ్ క్రిష్'పై మరో ఆసక్తికర అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో హీరోయిన్‌గా మానస వారణాసిని ఎంపిక చేశారు. శ్రీను వైట్ల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో శర్వానంద్‌కు జోడీగా ఆమె కనిపించనున్నారు. 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో ఇటీవల మంచి గుర్తింపు తెచ్చుకున్న మానస.. తన నటనతో ప్రశంసలు అందుకున్నారు. ఇప్పుడు 'జార్జ్ క్రిష్'లో ఆమె పాత్రకు చాలా ప్రాధాన్యం ఉంటుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. శర్వానంద్, శ్రీను వైట్ల తొలిసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ సినిమాపై మొదటి నుంచే ఆసక్తి నెలకొంది. శర్వానంద్ వరుస విజయాలతో మంచి జోష్‌లో ఉన్నారు. 'నారి నారి నడుమ మురారి', 'బైకర్' సినిమాలు ఇటీవల ప్రేక్షకులను అలరించాయి. 'జార్జ్ క్రిష్'ను ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర సమర్పిస్తున్నారు. రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. అజయ్ సుంకర సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సంక్రాంతి కానుకగా సినిమాను విడుదల చేయనున్నారు. శర్వానంద్‌కు సంక్రాంతి సెంటిమెంట్ కూడా ఉంది. 'శతమానం భవతి', 'ఎక్స్‌ప్రెస్ రాజా', 'నారి నారి నడుమ మురారి' వంటి సినిమాలు సంక్రాంతి బరిలోకి వచ్చి విజయాలు అందుకున్నాయి.



## ఉపాసనకు కొత్త పోస్ట్

భారతీయ వైద్య రంగంలో అగ్రగామిగా ఉన్న అపోలో హాస్పిటల్స్ దేశవ్యాప్తంగా తన వైద్య సేవలను మరింత విస్తరించేందుకు భారీ ప్రణాళికలను సిద్ధం చేసింది. ఇందులో భాగంగానే సుమారు రూ. 8,600 కోట్ల భారీ అంచనా వ్యయంతో నూతన ఆసుపత్రుల నిర్మాణం.. ఇప్పటికే ఉన్న వైద్య వసతుల ఆధునికీకరణకు శ్రీకారం చుట్టింది. సామాన్య ప్రజలకు కూడా అత్యుత్తమ వైద్యం మరింత సులభంగా అందుబాటులోకి తెచ్చే లక్ష్యంతో ఈ బృహత్తర కార్యక్రమానికి అపోలో యాజమాన్యం రూపకల్పన చేసింది. ఆస్పత్రిని సందర్శించే సామాన్యులకు ఎలాంటి కన్ఫ్యూజన్ లేకుండా స్పష్టమైన డిజైన్ల రూపకల్పనకు ఉపాసన మార్గదర్శకత్వం వహిస్తారు. ఈ అతిపెద్ద విస్తరణ ప్రాజెక్టులకు సంబంధించి కీలకమైన ప్రాజెక్ట్ డైరెక్టర్ బాధ్యతలను ఉపాసన కొణిదెల చేపట్టారు. ఈ బాధ్యతల్లో భాగంగా అపోలో నాయకత్వ బృందం, క్లినికల్ టీమ్స్.. ప్రాజెక్ట్ భాగస్వాములతో కలిసి దేశవ్యాప్తంగా కొత్త ఆసుపత్రుల రూపకల్పన, నిర్మాణ పనులను దగ్గరుండి పర్యవేక్షించనున్నారు. నిర్మాణ రంగంలో వస్తున్న అత్యాధునిక మార్పులను అపోలో ప్రాజెక్టులలో అమలు చేయడానికి ఉపాసన తన వంతు కృషి చేయనున్నారు.

## బిగ్‌బాస్ ఫేమ్ వర్షిణి అరెస్ట్



బిగ్‌బాస్ తమిళ్ సీజన్ 8 ద్వారా గుర్తింపు పొందిన నటి వర్షిణి వెంకట్‌ను చెన్నై పోలీసులు అరెస్ట్ చేశారు. షార్ట్‌ఫిలిం నిర్మిద్దామని చెప్పి ఓ యువకుడిని మోసం చేయడమే కాకుండా, అతడిని బెదిరించి లక్షల రూపాయలు వసూలు చేశారనే ఆరోపణలపై ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ఆమెను కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం జ్యుడీషియల్ కస్టడీ విధించింది. గిండి ప్రాంతంలోని హాస్టల్‌లో ఉంటూ స్టాక్ ట్రేడింగ్ చేసే 26 ఏళ్ల తరుణ్ అనే యువకుడికి వర్షిణితో పరిచయం ఏర్పడింది. షార్ట్‌ఫిలిం నిర్మాణానికి పెట్టుబడి పెట్టాలని చెప్పి అతడి నుంచి డబ్బులు తీసుకుంది. అయితే, ఇచ్చిన డబ్బు తిరిగి ఇవ్వమని తరుణ్ అడగడంతో కథ అడ్డం తిరిగింది. ఆగస్టు 22న గిండిలోని ఒక హోటల్‌కు పిలిపించిన వర్షిణి.. ఆమె స్నేహితుడు సంజయ్, మరో ఇద్దరితో కలిసి తనపై దాడికి పాల్పడినట్టు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆ సమయంలో తన వద్ద ఉన్న రూ.50 వేల నగదు, రెండు సెల్‌ఫోన్లను లాక్కున్నారని ఆరోపించాడు. అంతటితో ఆగకుండా, ఫోన్‌లో బెదిరించి మరో రూ.5 లక్షలను తన బ్యాంకు ఖాతాకు బదిలీ చేయించుకున్నారని బాధితుడు తెలిపాడు. ఇంకా రూ. 27 లక్షలు ఇవ్వాలని, లేకపోతే తప్పుడు కేసులు పెట్టిస్తామని, కాల్చి చంపుతామని బెదిరించినట్లు పోలీసులకు వివరించాడు. బాధితుడి ఫిర్యాదుతో గిండి పోలీసులు వర్షిణి, సంజయ్ సహా నలుగురిపై మోసం, దోపిడీ, బెదిరింపు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. బ్యాంకు లావాదేవీలను పరిశీలించి వర్షిణి ఖాతాకు డబ్బు బదిలీ అయినట్లు నిర్ధారించుకున్న తర్వాత మైలాపూర్‌లోని ఆమె నివాసంలో అరెస్ట్ చేశారు. ఆమె నుంచి ఒక ఐఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో పరారీలో ఉన్న మిగతా ముగ్గురు నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.



## చాలా భయపడ్డా

బాలీవుడ్ విలక్షణ నటి రాధికా ఆప్టే సినిమా ప్రపంచంలో తనకంటూ ఓ ప్రత్యేకమైన ముద్ర వేసుకున్నారు. వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ ఎంతటి సంక్లిష్టమైన సీన్స్‌లోనైనా సహజ సిద్ధమైన నటనను ప్రదర్శించడం అమ్మడి ప్రత్యేకత. ఇటీవల లస్ట్ స్టోరీస్ 3 ప్రాజెక్ట్‌తో మరోసారి వార్తల్లో నిలిచిన నటి గతంలో ఓ సినిమాకి చెందిన తన శృంగార సన్నివేశం లీక్ అయినప్పుడు తాను అనుభవించిన మానసిక వేదనను ఓ ఇంటర్వ్యూలో గుర్తు చేసుకున్నారు. ఆ సంఘటన తన జీవితంలో మిగిల్చిన చేదు జ్ఞాపకగా అభివర్ణించారు. ఆ క్లిప్ వైరల్ అయిన తర్వాత నేను నాలుగు రోజుల పాటు ఇల్లు దాటి బయటకు రాలేకపోయాను. తీవ్రమైన మానసిక ఒత్తిడి, ఆందోళన తో ప్రపంచాన్ని ఎదుర్కొనే ధైర్యం లేక ఇంటికే పరిమితమైనట్లు తెలిపారు. చుట్టూ ఉన్న ప్రజలు, సమాజం నుంచి ఎదురైన చూపులు తట్టుకోవడం మరింత కష్టంగా మారిందని రాధికా వివరించారు. లీకైన సదరు వీడియా క్లిప్‌ను చుట్టూ ఉన్నవారందరూ చూడటం, దాని గురించే చర్చించుకోవడం తీవ్రంగా కలచివేసిందన్నారు. ఒక నటిగా పాత్రల కోసం కెమెరా ముందు నటించడం వేరని, కానీ అనుమతి లేకుండా ప్రైవేట్ క్లిప్‌లను నెట్‌లో పెట్టి వ్యాపారం చేయడం ..వైరల్ చేయడం ఆ నటి వ్యక్తిత్వాన్ని దెబ్బతీస్తుందని అభిప్రాయపడ్డారు.



## విజయ్‌పై క్రష్ తగ్గలేదు

రియల్ లైఫ్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న కలిసి నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి' సినీ అభిమానుల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ 'సింగనమల బొబ్బిలి రణబాలి'గా పవర్‌ఫుల్ పాత్రలో అలరించనుండగా, ఆయనకు జోడీగా రష్మిక 'జయమ్మ' పాత్రలో నటిస్తోంది. ఇటీవల విడుదలైన 'ఏందయ్యా సామీ..' పాట యూట్యూబ్‌తో పాటు సోషల్ మీడియా వేదికగా విశేష ప్రజాదరణ పొందుతోంది. తాజాగా, ఈ పాటలోని ఒక రొమాంటిక్ క్లిప్‌ను రష్మిక తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ... అతను పూర్తిగా తనకే సొంతమయ్యాడని, కానీ అతనిపై ఉన్న క్రష్ మాత్రం ఏమాత్రం తగ్గలేదని కామెంట్ చేసింది. దీనికి విజయ్ దేవరకొండ రిప్లై ఇస్తూ... "నేను ఎంతో అదృష్టవంతుడిని. నేను జయమ్మని మిస్ అవుతాను కానీ.. జీవితాంతం నువ్వు నా దగ్గరే ఉంటావు" అని ఎంతో ప్రేమగా స్పందించాడు. ఈ సరదా సంభాషణ మరియు వారి మధ్య ఉన్న అనుబంధం చూసి అభిమానులు మురిసిపోతున్నారు.




# రిలేలో రజతం..




ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు తమ సత్తా చాటారు. 400 రిలే రేసులో రజతంతో పాటు 10 వేల మీటర్ల పరుగు పందెంలో కాస్యం గెలిచారు. 16 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ 10 వేల మీటర్ల పరుగు పందెంలో సీమా కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నారు. 400 రిలే రేసులో మను, పూవమ్మ, విశాల్, విద్యలతో కూడిన భారత బృందం 3.14.46 నిమిషాల్లో రేసును ముగించి రజతం సొంతం చేసుకుంది. అయితే, బహ్రెయిన్ జట్టు 3.12.87 నిమిషాల్లోనే రేసు పూర్తి చేసి విజేతగా నిలవడంతో భారత్‌కు తృటిలో స్వర్ణ పతకం తప్పింది.

ఇక 10 వేల మీటర్ల రేసులో సీమా కుమారి 32.50.05 నిమిషాల్లో రేసును పూర్తి చేసి కాంస్యాన్ని సొంతం చేసుకున్నారు. 16 ఏళ్ల తరువాత ఆమె దేశానికి పతకం సాధించిపెట్టడంతో ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు. యావత్ దేశం ఆమెను చూసి గర్విస్తోందని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నట్టు చెప్పారు. ఈ పోటీలో బహ్రెయిన్‌కు విన్‌ఫ్రెడ్ స్వర్ణం, జపాన్‌కు చెందిన నొజోమీ తనకా రజతాన్ని సొంతం చేసుకున్నారు. గురువారం కూడా భారత క్రీడాకారులు పతకాలు సాధించడంలో మొత్తం పతకాల సంఖ్య 17కు పెరిగింది.







ఏషియన్ గేమ్స్‌లో భారత క్రీడాకారులు ఇప్పటి వరకూ ఒక స్వర్ణం, ఏడు రజత పతకాలు, తొమ్మిది కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. భారత వుషు క్రీడాకారిణి రోషిబినా దేవి ఆసియా క్రీడల్లో మరోసారి సత్తా చాటింది. చివరి నిమిషంలో జట్టులో చోటు దక్కించుకున్న రోషిబినా దేవి రజతంతో మెరిసింది. జపాన్‌లోని ఐచి-నాగోయా వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడల్లో మహిళల 60 కిలోల సాండా విభాగంలో ఆమె రజతం పతకం సాధించింది. భారత వుషు క్రీడాకారిణి రోషిబినా దేవి ఆసియా క్రీడల్లో మరోసారి సత్తా చాటింది. చివరి నిమిషంలో జట్టులో చోటు దక్కించుకున్న రోషిబినా దేవి రజతంతో మెరిసింది. జపాన్‌లోని ఐచి-నాగోయా వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడల్లో మహిళల 60 కిలోల సాండా విభాగంలో ఆమె రజతం పతకం సాధించింది. ఫైనల్లో చైనాకు చెందిన జాంగ్ షియావోయు చేతిలో 0-2 తేడాతో ఓడిపోయింది. రెండు రౌండ్లలోనూ చైనా క్రీడాకారిణి ఆధిపత్యం ప్రదర్శించింది

రోషిబినా దేవికి ఆసియా క్రీడల్లో ఇది వరుసగా మూడో పతకం. 2018 జకార్తా ఆసియా క్రీడల్లో ఆమె కాంస్య పతకం సాధించింది. 2023 హాంగ్‌జౌ క్రీడల్లో 60 కిలోల సాండా విభాగంలో రజతం గెలిచింది. ఇప్పుడు 2026 ఐచి-నాగోయా క్రీడల్లోనూ రజతం దక్కించుకుంది. దీంతో వరుసగా మూడు ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన తొలి భారత వుషు క్రీడాకారిణిగా రోషిబినా నిలిచింది. అయితే ఈసారి ఆసియా క్రీడల ప్రయాణం రోషిబినాకు అంత సులభంగా సాగలేదు.

మహిళల 60 కిలోల విభాగానికి జరిగిన ట్రయల్స్‌లో రోషిబినాను దివ్యాంశి చౌదరి ఓడించి భారత జట్టులో స్థానం సంపాదించింది ఆ తర్వాత దివ్యాంశికి గాయం కావడంతో ఆమె స్థానంలో రోషిబినాను జట్టులోకి తీసుకున్నారు. వైద్య పరీక్షల్లో దివ్యాంశికి తీవ్ర స్థాయి ఏసీఎల్ గాయం ఉన్నట్లు తేలడంతో ఆమెను జట్టు నుంచి తప్పించి రోషిబినాను ఎంపిక చేశారు. ఇలా చివరి నిమిషంలో జట్టులోకి వచ్చిన రోషిబినా ప్రీ-క్వార్టర్ ఫైనల్లో బంగ్లాదేశ్‌కు చెందిన షికా ఖాతూన్‌ను, క్వార్టర్ ఫైనల్లో మకావుకు చెందిన చు మాన్ సిన్‌ను, సెమీఫైనల్లో ఇండోనేషియాకు చెందిన థానియాను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. ఫైనల్లో ఓటమి పాలై రజతంతో సరిపెట్టుకుంది.



## రోహిత్‌తో నా బంధం ప్రత్యేకం: గంభీర్

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్.. సీనియర్ ఆటగాడు, మాజీ కెప్టెన్ రోహిత్ శర్మతో తనకున్న బంధంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తమ మధ్య ఉన్నది కేవలం కెప్టెన్-కోచ్ సంబంధం మాత్రమే కాదని, అంతకు మించిన బలమైన అవగాహన ఉందని స్పష్టం చేశాడు. ఆదివారం నుంచి తిరువనంతపురంలో వెస్టిండీస్‌తో ప్రారంభం కానున్న వన్డే సిరీస్ నేపథ్యంలో గంభీర్ జియోస్టార్‌తో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశాడు. "రోహిత్‌తో నా బంధం ఈనాటిది కాదు. అతను జట్టులోకి వచ్చినప్పుడు నేను సీనియర్ ఆటగాడిని. అప్పటి నుంచే మా మధ్య మంచి సంబంధం ఉంది. ఒకరి ఆలోచనా విధానం మరొకరికి బాగా తెలుసు. ఇది మైదానంలో మా పనిని చాలా సులువు చేస్తుంది. కొన్నిసార్లు నా ఆలోచన, కెప్టెన్ ఆలోచన వేర్వేరుగా ఉండొచ్చు. కానీ, అంతిమంగా జట్టు ప్రయోజనాలే



ముఖ్యమని ఇద్దరం నమ్ముతాం. అదే జరిగితే అంతకంటే మంచి విషయం మరొకటి ఉండదు" అని గంభీర్ వివరించాడు. 2024 జులైలో తాను హెడ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి పనిచేసిన నలుగురు కెప్టెన్లను గంభీర్ ప్రశంసించాడు. "నేను రోహిత్, సూర్యకుమార్ యాదవ్, శ్రేయస్ అయ్యర్, శుభ్‌మన్ గిల్‌తో కలిసి పనిచేశాను. ఈ నలుగురిలో నేను గమనించిన ముఖ్యమైన విషయం 'జట్టుకే తొలి ప్రాధాన్యం' ఇవ్వడం. తమకంటే జట్టు ప్రయోజనాలే ముఖ్యమని భావించే కెప్టెన్లతో పనిచేయడం నా అదృష్టం" అని అన్నాడు. కెప్టెన్ల గురించి గౌతీ విడివిడిగా మాట్లాడుతూ.. "శ్రేయస్‌లో నాయకత్వ లక్షణాలను నేను 2018లోనే గుర్తించాను. అప్పుడు ఢిల్లీ కెప్టెన్సీని అతనికి అప్పగించాను. ఇప్పుడు మళ్లీ అతనితో పనిచేసే అవకాశం వచ్చింది. ఇక, శుభ్‌మన్ గిల్ చాలా యువకుడు. ఇంగ్లండ్ లాంటి కఠినమైన పర్యటనలో ఐదు టెస్టులకు కెప్టెన్సీ ఇవ్వడమంటే, ఒకరిని లోతైన సముద్రంలోకి తోసేయడం లాంటిది. కానీ, గిల్ ఆ సవాలును అద్భుతంగా స్వీకరించి, ఈత కొట్టి బయటపడ్డాడు. రాబోయే సంవత్సరాల్లో అతనిలో అత్యుత్తమ ఆటను మనం చూస్తాం" అని గంభీర్ విశ్వాసం వ్యక్తం చేశాడు. ఆలోచనలు, వ్యూహాలు మారొచ్చని, కానీ జట్టు పట్ల కెప్టెన్ల ఉద్దేశం సరిగ్గా ఉన్నంత కాలం సహాయక సిబ్బందికి పని సులువు అవుతుందని పేర్కొన్నాడు.

## నా ఆట నేను ఆడతా: సెహ్వాగ్ కుమారుడు



భారత క్రికెట్‌లో డాషింగ్ ఓపెనర్‌గా పేరొందిన వీరేంద్ర సెహ్వాగ్ వారసుడు ఇప్పుడు మైదానంలోకి అడుగుపెట్టాడు. తండ్రి వారసత్వాన్ని అందిపుచ్చుకుంటూ ఆయన పెద్ద కుమారుడు 18 ఏళ్ల ఆర్యవీర్ సెహ్వాగ్ క్రికెట్‌లో తన ప్రయాణాన్ని ప్రారంభించాడు. ఇటీవలే భారత అండర్-19 జట్టు తరఫున ఆస్ట్రేలియాతో జరిగిన యూత్ వన్డే సిరీస్‌లో ఆర్యవీర్ అరంగేట్రం చేశాడు. ఈ సిరీస్‌లో మూడు మ్యాచ్‌లు ఆడి 28, 47, 34 పరుగులు సాధించాడు. అంతకుముందు ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లోనూ వెస్ట్ ఢిల్లీ లయన్స్ తరఫున ప్రాతినిధ్యం వహించాడు. ఈ సందర్భంగా ఓ క్రీడా ఛానెల్‌తో మాట్లాడిన ఆర్యవీర్, తన ప్రదర్శనపై కొంత నిరాశ వ్యక్తం చేశాడు. "మూడు మ్యాచ్‌లలోనూ మంచి ఆరంభాలు లభించినా, వాటిని భారీ స్కోర్లుగా మలచలేకపోయాను. చివరి గేమ్‌లో కూడా కుదురుకున్నాక సిక్స్ కొట్టే ప్రయత్నంలో ఔటయ్యాను. ఇది నన్ను నిరాశపరిచింది. క్రికెట్‌లో పేరు సంపాదించాలంటే భారీ పరుగులు చేయడం చాలా ముఖ్యం. ఇన్నింగ్స్‌ను దశలవారీగా విభజించుకుని ముందుకు సాగాలని నేర్చుకున్నాను" అని తెలిపాడు. ప్రఖ్యాత ఇంటిపేరుతో వచ్చే ఒత్తిడి గురించి మాట్లాడుతూ.. ఆర్యవీర్ ఎంతో పరిణతితో సమాధానమిచ్చాడు. "నా ఇంటిపేరు, మా నాన్న సాధించిన విజయాల గురించి నేను ఎంతో గర్వపడతాను. ఆయన పేరు వల్ల నాపై ఎలాంటి ఒత్తిడి, భారం లేదు. ప్రశంసలు, విమర్శలను పట్టించుకోకుండా నా ఆటపై, నా ప్రక్రియపై మాత్రమే దృష్టి పెట్టేలా మైండ్‌సెట్ క్రియేట్ చేసుకుంటున్నాను. అదే నాకు మంచిది" అని స్పష్టం చేశాడు. ఆస్ట్రేలియాతో సిరీస్ అనుభవం తనలో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని ఆర్యవీర్ చెప్పాడు. "అరంగేట్రం మ్యాచ్‌కు ముందు కొంచెం నర్వస్‌గా ఉన్నాను. ఆస్ట్రేలియా బౌలర్లు మంచి వేగంతో బౌలింగ్ చేశారు. వారిని ఎదుర్కోవడం ఎంతో ఆనందాన్నిచ్చింది" అని అన్నాడు. తన తండ్రి వీరేంద్ర సెహ్వాగ్ ఇచ్చే సలహాల గురించి కూడా ఆర్యవీర్ పంచుకున్నాడు.

## క్రికెటర్ల గాయాలపై జవాబుదారీతనం ఉండాలి

భారత క్రికెటర్ల గాయాలు, రిహాబిలిటేషన్ విషయంలో బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)పై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. దీనిపై మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఆటగాళ్ల గాయాల నిర్వహణలో జవాబుదారీతనం అవసరమని స్పష్టం చేశాడు. గాయాల విషయంలో సీఓఈ వ్యవస్థను మరింత సమర్థంగా పనిచేసేలా చూడాలని అభిప్రాయపడ్డాడు. తన యూట్యూబ్ ఛానల్‌లో అశ్విన్ మాట్లాడుతూ.. మూడు ఫార్మాట్లకు వేర్వేరు జట్లను సిద్ధం చేయాల్సిన సమయం వచ్చిందన్నాడు. అవసరాన్ని బట్టి ఒకరిద్దరు ఆటగాళ్లు మాత్రమే మూడు జట్లలో ఉండొచ్చని చెప్పాడు. అదే సమయంలో ఆటగాళ్ల గాయాల నిర్వహణకు ఎవరు బాధ్యత వహిస్తారనే అంశంపై స్పష్టత ఉండాలని పేర్కొన్నాడు. తమిళనాడు ప్రీమియర్ లీగ్ కోసం అనుమతి కోరినా వరుణ్ చక్రవర్తిని సీఓఈ విడుదల చేయలేదని అశ్విన్ ఉదాహరణగా చెప్పాడు.




## టీమిండియా మేనేజర్‌గా వికాస్ కత్యాల్

వెస్టిండీస్‌తో స్వదేశంలో జరగనున్న సిరీస్‌కు టీమిండియా మేనేజర్‌గా ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ) డైరెక్టర్ వికాస్ కత్యాల్ నియమితులయ్యారు. ఈ మేరకు డీడీసీఏ బుధవారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. కత్యాల్ నియామకం తమ అసోసియేషన్‌తో పాటు ఢిల్లీ క్రికెట్‌కు గర్వకారణమని పేర్కొంటూ ఆయనకు అభినందనలు తెలియజేసింది. ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న ఈ పర్యటనలో భాగంగా భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి. తిరువనంతపురంలో జరగనున్న తొలి వన్డేతో ఈ సిరీస్ ప్రారంభం కానుంది. మిగిలిన వన్డేలకు గువాహటి, న్యూ చండీగఢ్‌లు ఆతిథ్యం ఇవ్వనుండగా.. లక్నో, రాంచీ, ఇండోర్, హైదరాబాద్, బెంగళూరు వేదికలుగా టీ20 మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఈ సిరీస్‌లోని వన్డే జట్టుకు యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు.

నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

## ఎన్నికల సంఘంపై నీలినీడలు

ప్రజాస్వామ్యానికి ఎన్నికలే ప్రాణవాయువు. ఓటు అనే ఒక్క హక్కుతో సామాన్యుడు పాలకుడిని ప్రశ్నించగలడు.. పాలనను మార్చగలడు. ఆ ఓటుకు కాపలాదారుగా నిలవాల్సింది ఎన్నికల సంఘం. అందుకే రాజ్యాంగం ఎన్నికల సంఘానికి ప్రత్యేక అధికారాలను కల్పించింది. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల ఎన్నికల నిర్వహణతో పాటు ఓటర్ల జాబితాల పర్యవేక్షణ బాధ్యతను కూడా అప్పగించింది. కానీ.. కాపలాదారుడి మీదే అనుమానాల నీడ పడితే? ప్రశ్నించాల్సింది ఇదే! ఎన్నికల సంఘం తీసుకునే ప్రతి నిర్ణయం చట్టబద్ధంగా ఉండటమే సరిపోదు. అది ప్రజలకు నిష్పాక్షికంగా కనిపించాలి కూడా. ఎందుకంటే ఎన్నికల్లో ఓడిపోయిన పార్టీకి ఫలితాన్ని అంగీకరించడం కంటే.. ఎన్నికల ప్రక్రియపై నమ్మకం కోల్పోవడం ప్రజాస్వామ్యానికి మరింత ప్రమాదకరం. ప్రస్తుతం ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ అంశం ఈ చర్చకు మరింత ప్రాధాన్యం తెచ్చింది. ఎన్నికల సంఘం ప్రకారం, ఓటర్ల జాబితాల స్వచ్ఛత కోసం ఇలాంటి ప్రక్రియలు నిర్వహించడానికి రాజ్యాంగంలోని 324వ అధికరణ, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని నిబంధనలు ఆధారం. అర్హులైన ఓటర్ల పేర్లు ఉండాలి. అనర్హుల పేర్లు తొలగాలి. మరణించినవారు, శాశ్వతంగా వలస వెళ్లినవారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైనవారి వివరాలు సరిచేయాలి. ఇందులో ఎవరికీ అభ్యంతరం ఉండదు. కానీ.. అర్హుడైన ఒక్క ఓటరు పేరు కూడా పొరపాటున తొలగకూడదు. ఇదే అసలు పరీక్ష. బిహార్‌లో జరిగిన ప్రత్యేక సవరణ ప్రక్రియలో ప్రారంభ జాబితాలోని సుమారు 7.89 కోట్ల మంది ఓటర్లలో 65 లక్షల పేర్లు ముసాయిదా జాబితా నుంచి తొలగించబడ్డాయని, తుది జాబితాలో సుమారు 7.42 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని ఎన్నికల సంఘం వెల్లడించింది. అదే సమయంలో 21.53 లక్షల మంది కొత్త ఓటర్లను చేర్చినట్లు కూడా తెలిపింది. ఇలాంటి భారీ ప్రక్రియలో తప్పులు జరగకుండా చూడటం ఎన్నికల సంఘం బాధ్యత. తప్పులు జరిగితే వాటిని సరిదిద్దుకునే అవకాశం కల్పించడం మరింత ముఖ్యమైన బాధ్యత. ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లోనే ఓటర్లు తమ పేర్లను శోధించుకోవడానికి, వివరాలను సరిచేయడానికి, ఫిర్యాదులు చేయడానికి, ఓటరు జాబితాలను పరిశీలించడానికి వివిధ సేవలు అందుబాటులో ఉన్నాయి. అయితే.. ప్రజాస్వామ్యంలో “మాకు ప్రక్రియ ఉంది” అనడం కంటే “మా ప్రక్రియపై మీకు నమ్మకం కలిగేలా చేస్తాం” అనేదే కీలకం.



ఒక పార్టీ గుర్తుపై ప్రజల ముందుకు వెళ్లాలి.. అదే గుర్తుపై ప్రజల ఓట్లు అడగాలి.. ప్రజల విశ్వాసంతో ఎమ్మెల్యేగా గెలవాలి.. ఆ తర్వాత అదే పదవిలో కొనసాగుతూనే మరో పార్టీ కండువా కప్పుకోవాలి.. మరో పార్టీ తరఫున ఎన్నికల బరిలో దిగాలి.. ఇదే రాజకీయ ఫిరాయింపులపై చాలాకాలంగా కొనసాగుతున్న ప్రశ్న. దానం నాగేందర్ వ్యవహారంలో సుప్రీంకోర్టు తీర్పు ఈ ప్రశ్నకు మరోసారి న్యాయపరమైన ప్రాధాన్యతను తీసుకొచ్చింది. 2023 తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా దానం నాగేందర్ విజయం సాధించారు. అనంతరం ఆయన కాంగ్రెస్‌లో చేరారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ సమయంలో ఆయన శాసనసభ్యుడిగానే ఉన్నారు.

## ప్రజా తీర్పు ఫెయిల్ కాదు!

ఈ పరిణామాలపై దాఖలైన అనర్హత పిటిషన్లను అప్పటి శాసనసభ స్పీకర్ తిరస్కరించారు. ఆ నిర్ణయాన్ని సవాలు చేస్తూ హైకోర్టును ఆశ్రయించిన పిటిషనర్లకు అనుకూలంగా తీర్పు వచ్చింది. హైకోర్టు స్పీకర్ నిర్ణయాన్ని పక్కనపెట్టి, దానం నాగేందర్‌ను 2024 ఏప్రిల్ 23 నుంచి అనర్హుడిగా ప్రకటించింది. ఖైరతాబాద్ శాసనసభ స్థానం ఖాళీగా మారిందని స్పష్టం చేసింది. ఈ తీర్పును దానం నాగేందర్ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. అయితే సెప్టెంబర్ 24న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఆయన పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు చట్టాన్ని సరైన రీతిలో అర్థం చేసుకుందని, జోక్యం చేసుకోవాల్సిన కారణం లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. దీంతో హైకోర్టు తీర్పు నిలిచిపోయింది. ఇక్కడ అసలు చర్చ దానం నాగేందర్ ఒక్కరి గురించే కాదు. ఇది ఒక ఎమ్మెల్యే పార్టీ మారడం అనే పరిమిత అంశాన్ని దాటి, ప్రజలు వేసిన ఓటుకు ఉన్న విలువ ఏమిటి? అనే ప్రజాస్వామ్య మౌలిక ప్రశ్నను ముందుకు తెస్తోంది. ప్రజలు ఒక వ్యక్తికి మాత్రమే ఓటు వేయరు. అభ్యర్థితో పాటు పార్టీ గుర్తును, ఆ పార్టీ విధానాలను, రాజకీయ హామీలను పరిగణనలోకి తీసుకుని ఓటు వేస్తారు. ఒక పార్టీ గుర్తుపై గెలిచిన ప్రజాప్రతినిధి తన రాజకీయ అనుబంధాన్ని మార్చుకున్నప్పుడు, తనను గెలిపించిన ప్రజల తీర్పుతో పాటు తన పదవికి ఉన్న నైతిక బాధ్యతను కూడా పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందా? అన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. అందుకే రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌కు ప్రాధాన్యం వచ్చింది. రాజకీయ ఫిరాయింపులను నియంత్రించేందుకు తీసుకొచ్చిన ఈ నిబంధనలు కేవలం పార్టీల ప్రయోజనాలను కాపాడటానికే కాదు.. శాసనసభల్లో ప్రజల తీర్పు ప్రతిబింబించే విధానాన్ని పరిరక్షించడానికీ ఉద్దేశించినవే. అయితే మరో కీలక అంశం కూడా ఉంది. ఫిరాయింపులపై నిర్ణయం తీసుకునే అధికార వ్యవస్థ, నిర్ణయం తీసుకునే కాలపరిమితి, స్పీకర్ నిర్ణయాలపై న్యాయ సమీక్ష వంటి అంశాలు చాలా కాలంగా దేశవ్యాప్తంగా చర్చకు వస్తున్నాయి. దానం నాగేందర్ కేసులో కూడా స్పీకర్ నిర్ణయం, హైకోర్టు జోక్యం, అనంతరం సుప్రీంకోర్టు పరిశీలన.. ఈ మొత్తం ప్రక్రియ అదే చర్చను మళ్లీ ముందుకు తెచ్చింది. ఈ కేసులో ఒక విషయం మాత్రం స్పష్టంగా నమోదైంది. ఎన్నికల తర్వాత రాజకీయ సమీకరణాలు మారవచ్చు.. కానీ ఎన్నికల ద్వారా ఏర్పడిన రాజ్యాంగబద్ధ పదవికి సంబంధించిన నిబంధనలు మాత్రం రాజకీయ పరిణామాలకు అనుగుణంగా మారవు. పార్టీ ఫిరాయింపులపై న్యాయస్థానాల తీర్పులు ఒక్కో కేసు వాస్తవాల ఆధారంగా ఉంటాయి. కాబట్టి దానం నాగేందర్ కేసు తీర్పును ఇతర ఎమ్మెల్యేల కేసులకు స్వయంచాలకంగా వర్తిస్తుందని చెప్పడం కంటే, ప్రతి కేసులోని వాస్తవాలు, ఆధారాలు, రాజ్యాంగ నిబంధనలు, న్యాయస్థానాల పరిశీలనలను విడివిడిగా చూడాల్సి ఉంటుంది. అయితే రాజకీయ వ్యవస్థకు మాత్రం ఈ తీర్పు ఒక విస్తృత సందేశాన్ని ఇస్తోంది. ప్రజల ఓటు ఐదేళ్లపాటు రాజకీయ బేరసారాలకు ఇచ్చిన హక్కు కాదు. అది ఒక ప్రజా బాధ్యత. ఎన్నికల ముందు ఒక మాట.. ఎన్నికల తర్వాత మరో మాట.. ఒక గుర్తుపై గెలిచి మరో గుర్తుతో రాజకీయ ప్రయాణం.. ఇలాంటి పరిణామాలు ప్రజల్లో ఎన్నికల వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీయకుండా ఉండాలంటే పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని మరింత స్పష్టంగా, వేగంగా అమలు చేసే మార్గాలపై రాజకీయ వ్యవస్థ ఆలోచించాల్సిన అవసరం ఉంది.



**నవీన్ పటేల్**
బీఆర్ఎస్ సీనియర్ నేత



## 22ఏపై ఇక మాటలు కాదు.. పరిష్కారం కావాలి

ఒక భూమి మీద హక్కు ఉండి.. దాన్ని అమ్ముకోలేని పరిస్థితి. పత్రాలు ఉండి.. రిజిస్ట్రేషన్ చేసుకోలేని దుస్థితి. ఏళ్ల తరబడి పన్నులు కడుతూ.. ఒక్కసారిగా ఆ భూమి నిషేధిత జాబితాలో కనిపిస్తే ఆ యజమాని పరిస్థితి ఏమిటి? తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల సమస్య ఇలాంటి వేలాది కుటుంబాల ఆందోళనకు కారణమైంది.

22ఏ నిబంధన ఉద్దేశం ప్రభుత్వ, అటవీ, అసైన్డ్, దేవాదాయ, వక్ఫ్ తదితర రక్షిత భూములను అక్రమ లావాదేవీల నుంచి కాపాడటమే. ఆ రక్షణ అవసరమే. కానీ ప్రభుత్వ భూమిని కాపాడే నిబంధన.. పొరపాటున లేదా తప్పు నమోదుతో నిజమైన ప్రైవేటు భూమి యజమానికే శిక్షగా మారకూడదు. ఇటీవల శాసనసభలో ముఖ్యమంత్రి 22ఏ సమస్యలపై సమగ్ర పరిశీలన చేపడతామని, ఉన్నతస్థాయి కమిటీ ద్వారా అంశాలను పరిశీలిస్తామని, కొత్త మార్గదర్శకాలు రూపొందిస్తామని ప్రకటించారు. నిజమైన హక్కుదారులకు ఇబ్బంది లేకుండా సమస్యలను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఇది ఒక విధాన ప్రకటనగా కాకుండా.. బాధిత కుటుంబాలకు పరిష్కార ప్రక్రియగా మారాలి. ఎందుకంటే సమస్య కేవలం రిజిస్ట్రేషన్ ఆగిపోవడం కాదు. భూమి అమ్మలేరు. బ్యాంకు రుణం పొందలేరు. కుటుంబ అవసరాలకు ఆస్తిని వినియోగించుకోలేరు. తరతరాలుగా ఉన్న ఆస్తి ఒక్క నమోదు లోపంతో వివాదాస్పదంగా మారుతుంది. భూ భారతి పోర్టల్‌లో నిషేధిత జాబితాలో చేర్పుపై ఫిర్యాదు చేసే అవకాశం ఉన్నప్పటికీ, సామాన్యుడికి అసలు సమస్య పరిష్కారం ఎప్పుడు, ఎలా జరుగుతుందన్నదే. ఇక్కడ ప్రభుత్వానికి రెండు బాధ్యతలు ఉన్నాయి. మొదటిది.. నిజంగా ప్రభుత్వానికి లేదా ఇతర రక్షిత సంస్థలకు చెందిన భూమి ఒక్క అంగుళం కూడా అక్రమంగా బయటకు వెళ్లకుండా చూడటం. రెండోది.. ప్రైవేటు వ్యక్తికి చట్టబద్ధమైన హక్కు ఉన్న భూమి పొరపాటున 22ఏలో చేరితే దాన్ని వేగంగా తొలగించడం. ఈ రెండింటిలో ఏదో ఒకదానినే ఎంచుకోవాల్సిన అవసరం లేదు. 22ఏ సమస్యకు శాశ్వత పరిష్కారం కావాలంటే ప్రతి దరఖాస్తును సంవత్సరాల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పకుండా కాలపరిమితితో పరిష్కరించాలి. పాత రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, కోర్టు తీర్పులు, భూ భారతి నమోదులను సమన్వయం చేసి నిర్ణయం తీసుకోవాలి. తప్పుగా నిషేధిత జాబితాలో చేరిన భూమిని తొలగించిన తర్వాత ఆ మార్పు అన్ని సంబంధిత ప్రభుత్వ వ్యవస్థల్లో ఒకేసారి ప్రతిబింబించేలా చేయాలి. ఇది కేవలం భూ యజమానుల సమస్య కాదు. రాష్ట్రంలో ఆస్తి హక్కు, రిజిస్ట్రేషన్ వ్యవస్థపై ప్రజల నమ్మకానికి సంబంధించిన అంశం. ప్రభుత్వం పరిష్కారానికి అడుగు వేసింది. ఇప్పుడు ఆ అడుగు కార్యాలయాల ఫైళ్లలో ఆగిపోకుండా.. బాధితుల భూములపై కనిపించాలి. 22ఏ జాబితా రక్షణకు కవచంగా ఉండాలి.. నిజమైన భూ యజమానికి సంకెళ్లుగా కాదు.

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.